J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 15 12.9.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• టార్గెట్ జగన్




# రూటే సపరేటు.. తప్పదా వేటు!


- ఈ నెల 18 నుండి అసెంబ్లీ సమావేశాలు
- వైసీపీ సభ్యులు సభకి రాకుంటే సభ్యత్వం రద్దు
- ప్రత్యేక తీర్మానానికి కూటమి ప్రభుత్వ వ్యూహం

శత్రువును తుదముట్టించే అస్త్రాలను ఇంట్లో కట్టిపెట్టి, యుద్ధంలో మీ సంగతి తేల్చేస్తాం, అనడం అసంబద్ధం..! కత్తిని ఒరలోనే ఉంచి మీ కుత్తుకలు కోసేస్తాం అంటూ విర్రవీగడం అవివేకం..! ఇది రాజుల కాలంలో చెప్పే సూక్తి. ప్రస్తుతం ప్రజాస్వామ్య భారతంలో అందునా ఆంధ్రప్రదేశ్‌లో ఓ రాజకీయ పక్షం వ్యవహారశైలి ఈ సూక్తికి అచ్చుగుద్దినట్లు సరిపోతోందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే సభకు వస్తానని లేకుంటే.. అసెంబ్లీతో తనకు పనిలేదు అనే రీతిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొండిగా వ్యవహరిస్తుండడం విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఇలాంటి సమయంలో సభకు రాని ఎమ్మెల్యేలకు పదవులెందుకు..? జీతాలెందుకు..? అంటూ కూటమి నేతలు జగన్ పార్టీపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. దీనికి కొనసాగింపు అన్నట్లుగా, ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో సభకు హాజరుకాని ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు కోసం ప్రత్యేక తీర్మానం కూడా చేయాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే ఇప్పటికే ఎన్నికల్లో ఓటమి అనంతరం ఆపసోపాల ప్రయాణం సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేతకు కొత్త తలనొప్పి ప్రారంభమైనట్లేననే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## చరిత్ర ఘనం.. మరి నేడు!

ఆంధ్రప్రదేశ్ శాసనసభ, ఉద్దండులైన ఎందరో నేతలను దేశానికి అందించింది. తొలుత ఆంధ్ర రాష్ట్రాన్ని పాలించిన టంగుటూరి ప్రకాశం పంతుల నుంచి, నేటి విభజిత ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు వరకు ఎందరో ముఖ్యమంత్రులు తమ పాలనతో ప్రజలపై చెరగని ముద్ర వేశారు. ఈ క్రమంలో ఎందరో ప్రతిపక్ష నాయకులు పాలకుల తీరును ఎండగట్టి, అధికార పక్షాన్ని ముప్పుతిప్పలు పెట్టేవారు. ప్రభుత్వం చేసే తీర్మానాల్లో ప్రజాకంటకంగా ఉండే వాటిని తమ వాగ్దాటితో, సమర్థంగా తిప్పి కొట్టేవారు. అవసరమైతే అడ్డుకునే వారు కూడా. అయితే కాలం ప్రవాహశీలం అన్నట్లు, ఏపీ శాసనసభ కాలక్రమేణా తన వన్నె కోల్పోతోందంటే అతిశయోక్తి కాదేమో. ఎందుకంటే 2024 ఎన్నికల్లో 164 సీట్లతో ఏకంగా చరిత్ర సృష్టించిన కూటమి ప్రభుత్వ పక్షాలు అత్యంత బలంగా సభలో అడుగు పెట్టాయి. ఇక స్థాపించిన తొమ్మిదేళ్లలో అధికారంలోకి

10లో



## 15వ ఉపరాష్ట్రపతిగా సి.పి.రాధాకృష్ణన్

తమిళనాట నుండి 3వ వ్యక్తిగా రికార్డు!

12లో

## ఇప్పటికైనా అర్థమైందా.. వైసీపీకి.. పదకొండే ఎందుకొచ్చాయో!?

సీనియర్ జర్నలిస్ట్ భోగాది వేంకటరాయుడు ప్రత్యేక విశ్లేషణ... 2లో



## డీకెడబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్‌కి సన్మానం



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన డీకెడబ్ల్యు జూ.కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.రమణారెడ్డిని ఈనెల 8 విద్యార్థులు అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ పాల్గొని సన్మానపత్రం సమర్పించారు. ఉపాధ్యాయునిగా ఉత్తమ సేవలందిస్తున్న రమణారెడ్డిని అభినందించారు.

## జిల్లా పౌరసంబంధాల శాఖ డీడీగా వేణుగోపాలరెడ్డి



జిల్లా పౌరసంబంధాల శాఖకి కొత్త డీడీ వస్తున్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న పి.వేణుగోపాల్‌రెడ్డిని నెల్లూరుజిల్లాలో డిప్యూటి డైరెక్టర్ (డీడీ)గా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా ఈనెల 9న ఉత్తర్వులిచ్చారు. ఉద్యోగోన్నతిపై ఆయన త్వరలోనే డీడీగా బాధ్యతలు స్వీకరించనున్నారని సమాచారం. కొత్త డీడీ వేణుగోపాల్‌రెడ్డికి 'లాయర్' శుభాకాంక్షలు.

## పుష్కలంగా యూరియా

జిల్లాలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతరాయంగా యూరియాను సరఫరా చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 2471 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని, రాబోయే 10 రోజుల్లో మరో 500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని ఆయన తెలిపారు. రైతులు తప్పనిసరిగా తమ వేలిముద్రలు నమోదు చేసుకుని ఆధార్ అధీకృత విధానం ద్వారా యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. రైతుల తగిన మోతాదు మేరకు మాత్రమే యూరియాను వినియోగించాలని, అధికంగా ఎరువులను వినియోగిస్తే చీడ పీడల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉన్నందున నిర్దేశించిన మోతాదులోనే యూరియాను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. రైతులకు ఎలాంటి అంతరాయం కలగకుండా రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. ఎవరైనా అధిక ధరలకు యూరియా అమ్మితే సమీపంలో ఉన్న మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. రైతులు ఎవరైనా సరే యూరియా సరఫరాలో ఇబ్బందులు ఉన్నట్లయితే టోల్ ఫ్రీ నెంబరు 8331057285లో సంప్రదించాలన్నారు.

### ఇప్పటికైనా అర్థమైందా..

# వైసీపీకి..పదకొండే ఎందుకొచ్చాయో!?



*1. వైఎస్ఆర్ రైతు భరోసా!*
*2. వైఎస్ఆర్ చేయూత!*
*3. వైఎస్ఆర్ ఆసరా!*
*4. వైఎస్ఆర్ కాపు నేస్తం!*
*5. వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం!*
*6. వైఎస్ఆర్ జలకళ!*
*7. వైఎస్ఆర్ లా నేస్తం!*
*8. వైఎస్ఆర్ బీమా!*
*9. వైఎస్ఆర్ పెన్షన్ కానుక!*
*10. వైఎస్ఆర్ సున్నా వడ్డీ!*
*11. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ!*
*12. వైఎస్ఆర్ వీడియోన్నతి!*
*13. వైఎస్ఆర్ కల్యాణ మస్తు!*
*14. వైఎస్ఆర్ మత్స్యకార నేస్తం!*
*15. వైఎస్ఆర్ వాహన మిత్ర!*
*16. వైఎస్ఆర్ కంటి వెలుగు!*

*ఇవి సరిపోలేదు అన్నట్టుగా జగన్మోహన్‌రెడ్డి పేరు మీద...*

*1. జగనన్న అమ్మ ఒడి!*
*2. జగనన్న విద్యా దీవెన!*
*3. జగనన్న వసతి దీవెన!*
*4. జగనన్న గోరు ముద్ద!*
*5. జగనన్న విద్యా కానుక!*
*6. జగనన్న కాలనీ!*
*7. జగనన్న విదేశీ విద్యా దీవెన!*
*8. జగనన్న సివిల్ సర్వీస్ ప్రోత్సాహకం!*
*9. జగనన్న ఆణిముత్యాలు!*

*డాక్టర్ వై.ఎస్ పేరు మీద, జగన్‌మోహన్‌రెడ్డి పేరు మీద... మొత్తం కలిపి పాతిక పథకాలు పెట్టారు. ఇవన్నీ.. జనాన్ని గొర్రెలుగా అంచనా వేసి, విదిలించిన తాయిలాలు.*

*కానీ, 175 స్థానాలకు గాను, పదకొండు స్థానాలే వైసీపీకి లభించాయి.*

ఎందుకు ఇలా జరిగిందో జగన్మోహన్‌రెడ్డి ఎప్పుడైనా సమీక్షించుకున్నారో లేదో తెలియదు. అధికారంలో ఉన్న సమయంలో... డాక్టర్ వై.ఎస్ అభిమానులను, శ్రేయోభిలాషులను, చివరకు తన హితులను సైతం ఎప్పుడైనా దగ్గరకు రానిచ్చారో... లేదో తెలియదు.

ఒక్క పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహా, తన మంత్రివర్గంలోని మంత్రులందరూ ఎందుకు ఓడిపోయారో జగన్మోహన్‌రెడ్డి ఎప్పుడైనా సమీక్షించుకున్నారో... లేదో తెలియదు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పేరు మీద పెట్టుకున్న రాజకీయపార్టీకి ఆయనను ఆరాధ్య దైవంగా భావించే తెలుగు రాష్ట్రంలో కేవలం పదకొండు సీట్లే ఎందుకు విదిలించవలసి వచ్చిందో... ఆయన కుమారుడైన జగన్ ఎప్పుడైనా ఆత్మావలోకనం చేసుకున్నారో... లేదో తెలియదు. ఆయన స్మృతికి ఇంతకుమించిన అపచారం ఏముంటుంది!?.

వై.ఎస్ ప్రధాన సలహాదారు డాక్టర్ కేవీపీ రామచంద్రరావుతో తన సలహాదారులను, వై.ఎస్ మంత్రివర్గ సహచరులైన కొణిజేటి రోశయ్య, రఘువీరారెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, ఎం.సత్యనారాయణరావు, శత్రుచర్ల విజయరామరాజు, కొణతాల రామకృష్ణ, కన్నా లక్ష్మీనారాయణ, జేసీ దివాకరరెడ్డి, జానారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, గీతారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, షబ్బీర్ అలీ వంటి నేతల స్థాయి, రాజకీయ పరిపక్వత, హుందాతనం కలిగిన నేతలతో తన క్యాబినెట్‌లోని వారిని జగన్ ఒక్కసారి పోల్చుకుంటే... లోపం ఎక్కడుందో ఆయనకు ఒకరు చెప్పాల్సిన పని లేదు.

రాజశేఖరరెడ్డి తనయుడుగా... తెలుగు ప్రజలు గంపెడాశలు ఆయనపై పెట్టుకుని... 175కి 151 స్థానాలు పువ్వుల్లో పెట్టి ఆయనకు అప్పగించారు.

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార సభలో ఎంతో ఉదాత్తంగా మాట్లాడారు.

చివరికి, ప్రభుత్వ యంత్రాంగాన్ని సజ్జల రామకృష్ణారెడ్డి అనే తెలుగు ప్రజలకు తెలియనాయనకు అప్పగించారు. ప్రజలు జగన్మోహన్‌రెడ్డి పాలన కావాలి అనుకున్నారు గానీ, సజ్జల రామకృష్ణారెడ్డి పాలన కావాలని కలలో కూడా అనుకోలేదు.

ప్రజాక్షేత్రంలో గానీ, ప్రభుత్వ యంత్రాంగ నిర్వహణలో గానీ సజ్జలకు వీసమెత్తు అనుభవం లేదు.

పోనీ... మంత్రులెవరయ్యా అని చూస్తే, అత్యధికులు ఆవారా గ్యాంగ్‌లను తలపించేవారిగా జనానికి కనిపించారు.

మంత్రుల స్థాయిలో నోళ్లు తెరిస్తే.... బూతులు, నోళ్లు తెరవకపోతే... దోపిడీలు, దౌర్జన్యాలు, కక్షలు – కార్పణ్యాలే ప్రధాన వ్యాపకంగా చెలరేగిపోవడాలు.

గాంధీజీ ఒక మాట అన్నారు.

'నీ మిత్రులు ఎవరో నువ్వు చెప్పు. నీవు ఎవరివో నేను చెబుతాను' అని.

ఇటువంటి వారిని మంత్రులుగా పెట్టుకుని, తాను క్యాంపు ఆఫీస్‌కి పరిమితమై, పాలనను సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించి, ఎవరికి వీలైన పద్ధతుల్లో వారిని రాష్ట్రాన్ని చెరబట్టమని జగన్ వదిలేశారా! అనే భావం ప్రజల్లో అత్యధికుల్లో కలిగిన ఫలితమే... పదకొండు సీట్లు.

చంద్రబాబునాయుడు, లోకేష్‌పై కక్ష, కార్పణ్య ప్రదర్శన, వేధింపులు, జైళ్లు, అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా ఇళ్ల మీదపడి తలుపులు పగలగొట్టడాలు, భీకరమైన అవినీతి, ప్రకృతి వనరుల నిలువు దోపిడీ అనేవే వైసీపీ ప్రధాన లక్షణాలుగా ప్రజలకు కనిపించాయి.

నిజానికి డెమోక్రసీ అనరు. డెమోక్రసీ ముసుగులో ఉన్న క్లెప్టోక్రసీ అంటారు. అంటే ఏమిటో.... వైసీపీ నేతలు... ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు చూసుకోవచ్చు.

లేదా, ఆంధ్రప్రదేశ్ వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌ని అడిగి తెలుసుకోవచ్చు... ఎందుకంటే, తాజాగా అనంతపురంలో జరిగిన 'సూపర్ సిక్స్.. సూపర్ సక్సెస్' సభలో మంత్రి వైసీపీని ఉద్దేశించి మాట్లాడుతూ "మీరంతా క్లెప్టోక్రసీ గ్యాంగ్.. మీరా మమ్మల్ని విమర్శించేది! ముందు మీరెవరో ఆత్మవిమర్శ చేసుకోండి. ఆ తర్వాతే ప్రభుత్వాన్ని విమర్శించండి" అని ఘాటుగా స్పందించారు.

అసలు ఈ క్లెప్టోక్రసీ వ్యవస్థ స్థాపనకే వైసీపీని పెట్టారా అనే భయ సందేహాలకు అత్యధికులు లోనైన ఫలితమే 11 సీట్లు.

వైసీపీకి డబ్బులేక, అన్ని తక్కువ సీట్లు వచ్చాయా? ఇతర ప్రలోభాలకు ఓటర్లను గురిచేయడంలో లోపం వల్ల, వైసీపీ ఇంత ఘోరంగా ఓడిపోయిందా!? ఎన్నికల్లో పోలీసు, ఇతర ప్రభుత్వ యంత్రాంగం వాడుకోవడంలో విఫలం కావడం వల్ల ఇంత దారుణంగా వైసీపీ ఓడిపోయిందా!? ఈ పరిస్థితులు చూస్తూ... డాక్టర్ వై.ఎస్ అభిమానులు చాలా ఆవేదనకు గురయ్యారు. కానీ, వారి ఆవేదనకు... ఆయన కుమారుడి జమానాలో దమ్మిడీ విలువలేకుండా పోయింది.

ఇప్పటికీ, జగన్‌ను అభిమానించేవారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. 'నెగటివ్' మైండ్‌సెట్ నుంచి 'పాజిటివ్' మైండ్‌సెట్‌లోకి జగన్ మారితేనే, వైసీపీకి రాజకీయ భవిష్యత్ ఉంటుంది అని ఆయన శ్రేయోభిలాషులలో ఒక అభిప్రాయం ఉంది. రాజకీయాలను రాజకీయాల్లా చేయాలి. దోపిడీ దొంగలు ఊళ్ల మీద పడినట్టుగా వ్యవహరించే గ్యాంగ్‌లీడర్లను చుట్టూ పెట్టుకుని, జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలు చేయడాన్ని ప్రజలు హర్షించరు. తిరుమలస్వామి వారి సన్నిధిలో... సంప్రదాయ ఆశీర్వచన సందర్భంలో పండితోత్తములు వేసిన అక్షింతలను అక్కడే... అప్పుడే దులిపేసుకున్న జగన్, ఇప్పుడు శాస్త్రోక్తంగా వినాయక చవితిని చేయడం, దేవునికి కొబ్బరికాయ కొట్టి, బొట్టు పెట్టుకుని, భక్తిప్రపత్తులతో హారతి ఇవ్వడాన్ని... ఆయనలో కనిపించిన ఆహ్వానించదగిన పరిణామంగా పలువురు పేర్కొంటున్నారు.

బ్రూటల్ మర్డర్‌కు గురైన వివేకానందరెడ్డిని తిరిగి తీసుకురావడం అనేది ఆయన చేతుల్లో లేదు కానీ, ఆయన నాయకత్వాన్ని ఆవహించిన మిగిలిన "నెగటివ్" వాతావరణం మొత్తాన్ని జగన్‌మోహన్‌రెడ్డి వదిలించుకోవచ్చు.

ఆయన పేరు చెప్పి, చెప్పకుండాను .. వందలు, వేల కోట్లు సంపాదించుకున్నారంటూ ప్రజాగ్రహాలకు లోనైన వారినందరిని, తన అండ చూసుకుని విర్రవీగిన వారిని, ఆరాచకాలకు పాల్పడినవారిని పార్టీకి సంబంధం లేకుండా చేయగలగాలి. వారు లేకుండా, జగన్మోహనరెడ్డి వైసీపీ పార్టీని నడపలేరా అనే విషయమై ఆయన ఆత్మావలోకనం చేసుకోవాలి. వారివల్ల వంద ఓట్లు కూడా రాలవు. ఆయన దయ వల్లనే వారు గెలవాలి.

కొడాలి నాని, పేర్ని నాని, అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వారితోనే రాజకీయం చేయాలని జగన్ భావిస్తే, తాము చెప్పగలిగింది ఏమీ లేదని, వై.ఎస్.రాజశేఖరరెడ్డి అభిమాని ఒకరు ఆవేదనకు లోనయ్యారు.

జగన్‌లో సానుకూల దృక్పథంతో కూడిన మార్పు చూడాలని ఆయనను అభిమానించేవారు బలంగా కోరుకుంటుంటే... ఆయనేమో... ఆర్థిక, సామాజిక నేరాలకు పాల్పడి... జైళ్ళల్లో ఉన్న వారిని పరామర్శించడానికి వెళుతున్నారు.

అయినప్పటికీ, మంత్రులు, ఎంఎల్‌ఏలు, ఎంపీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వీరి అనుచరులు, ఆ అనుచరుల పిల్ల అనుచరులు గతంలో తెలుగువారు కనీ, వినీ ఎరుగని రీతిలో అంతగా ఎందుకు బరితెగించిపోయారు?

ఇదే ప్రశ్నను ఒక వైసీపీ నేతను అడిగితే, ఆయన సింపుల్‌గా 'యథా రాజా... తథాః ప్రజా!' అన్నారు.

ప్రజలు కూడా అలాగే భావించారు.

అందుకే, సజ్జల రామకృష్ణారెడ్డి(దుర్) సలహాదారుత్వం పని చేయలేదు. ఐ ప్యాక్ ముఠా కుయుక్తులు పని చేయలేదు. సాక్షి మీడియా (దుష్) ప్రచారం పని చేయలేదు. డబ్బు పని చేయలేదు, మందూ... మాకూ పని చేయలేదు. 'సిద్ధం' వ్యూహం పని చేయలేదు. డాక్టర్ వై.ఎస్ పేరు పని చేయలేదు. 'జగనన్న' తాయిలాలు పని చేయలేదు. కేంద్రం ఆశీస్సులు పని చేయలేదు.

తెలంగాణలో కేసీఆర్ ఎందుకు ఓడిపోయారో... ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అందుకే ఓడిపోయారు.

వ్యవహారశైలిలో నిజాయితీ, ప్రభుత్వ నిర్వహణలో చిత్తశుద్ధి మొదలైనవి మచ్చుకైనా కనపడక పోవడం, పాలనలో బంధువర్గ ప్రమేయం... అసత్య ప్రచారాలు... అన్నిటినీ ప్రజలు నిత్యం గమనిస్తూనే ఉంటారు. ఆ గమనింపునే 'పబ్లిక్ పెర్సెప్షన్' అంటారు. దానిని వదిలేసి వ్యవహరించే ఏ రాజకీయపార్టీనీ ప్రజలు క్షమించరు. వాళ్ళు గొర్రెలని అనుకుంటారు, నాలుగు రూపాయలు విదిలిస్తే... పడి ఉంటారు అనే అభిప్రాయం చాలామంది రాజకీయ వ్యాపారుల్లో ఉంది.

గొర్రెలే కావచ్చు గానీ, తెలివైన గొర్రెలు. వాటి కొమ్ములకు పదునెక్కువ. వాటిని పొద్దస్తమానమూ వాడవు. పొడవాల్సిన సందర్భం ఎదురైనప్పుడు సైలెంట్‌గా కుమ్మేస్తయ్. ఇప్పటికైనా అర్థమైందా!...

అందుకే... వైసీపీకి పదకొండు సీట్లు వచ్చాయ్.



**- భోగాది వేంకట రాయుడు**

# వైభవంగా పోలేరమ్మ జాతర

**● పోటెత్తిన భక్తజనం.. క్రిక్కిరిసిన వెంకటగిరి**







భక్తుల కొంగుబంగారం..మహాశక్తి స్వరూపిణి.. వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మవారి జాతరకు భక్తజనం పోటెత్తారు. ఎక్కడ చూసినా భక్తజనసందోహంతో వెంకటగిరి క్రిక్కిరిసిపోయింది. వీధివీధినా ఇసుకేస్తే రాలనంతగా జనం. జిల్లానుంచే కాక రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. ఈనెల 11న జాతర సందర్భంగా పోలేరమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ శోభలు, పూల అలంకరణలతో దేదీప్యమానమైంది. అమ్మవారి పుట్టినిల్లయిన కుమ్మరి ఇంట రూపుదిద్దుకున్న పోలేరమ్మ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయం వద్ద కొలువుదీర్చారు. అడుగడుగునా పూజలతో ఆలయం అలరారింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంప్రదాయబద్దంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను తలపై మోసుకుని వచ్చి శ్రీ పోలేరమ్మతల్లికి సమర్పించి పూజలు చేశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, ఆయన సతీమణి-కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిలు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దంపతులు అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవారి ఊరేగింపులో భక్తులు వేలసంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం వందల సంఖ్యలో పోలీసులను నియమించి బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేసింది.

# భక్తిశ్రద్ధలతో..శ్రీ రాజరాజేశ్వరిదేవి మాలధారణ



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో నెల్లూరు నగరంలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి 19వ అర్ధమండల మాల ధారణ కార్యక్రమం ప్రారంభమైంది. అమ్మవారికి పూజలు చేసి మాలధారణ ప్రారంభించారు. ఈ దీక్షా కార్యక్రమం 21 రోజుల పాటు జరుగుతుంది. అక్టోబరు 1వ తేదీ బుధవారం నాడు మాలధారణ ఇరుముడి కార్యక్రమం నిర్వహిస్తారు. శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిఏటా ఈ మాలధారణ కార్యక్రమం ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈసారి కూడా ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో అమ్మవారి భక్తులు మాలధారణ చేస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘురామమూర్తి భక్తులకు ఆ దీక్షా మాలలను ఇచ్చి ఆశీర్వదించారు. ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి.



## నెరవేరనున్న నెల్లూరీయుల కల

# దగదర్తి ఎయిర్‌పోర్టుతో విమానయాన కళ

నెల్లూరీయుల చిరకాల కల నెరవేరబోతోంది. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో నెల్లూరుకి విమానయాన కళ రాబోతోంది. నెల్లూరు సమీపంలోని దగదర్తి ప్రాంతంలో జాతీయ రహదారికి దగ్గరగా నెల్లూరు అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు 916 కోట్లరూపాయలతో మొదటి దశ పనులని చేపట్టడానికి టెండర్‌లు పిలిచినట్లు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి లిమిటెడ్ (ఏ.పి.ఏ.డి.సి.ఎల్) సంస్థ తెలిపింది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) విధానంలో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మిస్తారు. ఈ విమానాశ్రయం నిర్మాణం కోసం ఇప్పటికే 1352 ఎకరాలని ప్రభుత్వం సేకరించింది. మొత్తం 2600 ఎకరాల స్థలాన్ని ఈ విమానాశ్రయ నిర్మాణం కోసం గుర్తించగా, తొలి విడతగా 1352 ఎకరాలని సేకరించి సిద్ధంగా ఉంచింది.

**● 916 కోట్లతో టెండర్లు పిలిచారు!**

### వైసీపీ హయాంలో ఎగిరిపోయిన విమానాశ్రయం.. మళ్ళీ తిరిగొచ్చింది!

నిజానికి దగదర్తి ప్రాంతంలో నెల్లూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్(NIAL) పేరుతో విమానాశ్రయం నిర్మాణానికి 2019 జనవరిలోనే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. అప్పట్లో ఎస్.సి.ఎల్.-టర్బో కన్సార్టియం అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుని పనులని ప్రారంభించింది. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంస్థ కాంట్రాక్టుని రద్దు చేసింది. అంతేకాకుండా విమానాశ్రయాన్ని ప్రకాశం జిల్లా సమీపంలోని తెట్టు ప్రాంతానికి తరలిస్తున్నట్లు ప్రకటించి సరిపెట్టుకుంది. ఆనాటితో పనులు ఆగిపోయి, నెల్లూరీయుల ఆశలు వీగిపోయాయి. మళ్ళీ కూటమి ప్రభుత్వం వచ్చాక విమానాశ్రయ పనులకి రెక్కలు వచ్చాయి. నెల్లూరు నుండి ఎగిరిపోయిన విమానాశ్రయం మళ్ళీ తిరిగొచ్చింది. 45 సంవత్సరాల అవసరాలని దృష్టిలో పెట్టుకుని అంచెలంచెలుగా అభివృద్ధి చేసేలా ఈ ఆధునిక అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని నిర్మించబోతున్నట్లు అధికార వర్గాలు చెప్తున్నాయి.


# వైసీపీ ఆధ్వర్యంలో 'అన్నదాత పోరు'



రైతు సమస్యలు పరిష్కరించాలని, రైతులకు యూరియా కొరత లేకుండా అందించాలని, యూరియా బ్లాక్‌మార్కెట్‌కు అడ్డుకట్ట వేయాలని కోరుతూ 'అన్నదాత పోరు' పేరుతో వైసీపీ రాష్ట్ర కమిటీ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఆమేరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 'అన్నదాత పోరు' నిరసనల కార్యక్రమంలో భాగంగా ఈనెల 9న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ఆ పార్టీ జిల్లా నేతలు ఆందోళన చేశారు. అంతకుముందు విఆర్‌సి కూడలి వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, కాకాణి పూజిత, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందంటూ విమర్శలు చేశారు. రైతు సమస్యల పరిష్కారానికి వైసీపీ ఎల్లప్పుడూ ముందుంటుందని నాయకులు చెప్పారు. అనంతరం, జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు.

# ఫోటోగ్రఫీ, రీల్స్, వీడియోల పోటీలు

ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నెల్లూరు జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫోటోగ్రఫీ పోటీలు, రీల్స్, వీడియోల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అధికారిణి ఉషశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరుజిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వ కోటలు, జలపాతాలు, ఈకో-టూరిజం, స్థానిక వంటకాలు వంటి అంశాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులు, ఫోటోగ్రాఫర్లు, సృజనాత్మక ప్రతిభ కలిగినవారు ఈ పోటీలలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. ఫోటోలు హై రిజల్యూషన్ కలిగి నెల్లూరుజిల్లాలో తీసినవే అయి ఉండాలని, జెపిజి ఫార్మాట్‌లో వాటిని అందించాలన్నారు. ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొను వారు ఈనెల 20వ తేదీలోపు వాటిని అందజేయాలని, రీల్స్ మరియు వీడియోల పోటీలలో పాల్గొనేవారు తమ రీల్స్‌ను 30-90 సెకన్లు (ఇన్‌స్ట్రాగ్రామ్), వీడియో వ్యవధి గరిష్టంగా 3 నిమిషాలు ఉండేలా రూపొందించాలని సూచించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.5,000, ద్వితీయ బహుమతి రూ.3,000, తృతీయ బహుమతి రూ.2,000తో పాటు మెమెంటోలు, సర్టిఫికెట్లు ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు ఆమె చెప్పారు. ఫోటోలు, వీడియోలు, రీల్స్‌ను ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా పర్యాటక శాఖాధికారి కార్యాలయం, 2వ అంతస్తు, బోట్‌షికారు క్యాంపస్, బారా షహీద్ దర్గా దగ్గర, దర్గామిట్ట-నెల్లూరు చిరునామాకి అందించాలన్నారు. అభ్యర్థులు తమ వివరాలను 94936 68022 / 77807 49802 నంబర్లలో నమోదు చేసుకోవాలని కోరారు.

లాయర్
సెప్టెంబర్ 12, 2025

# వృక్షాల సంరక్షణకు 'సుప్రీం' బాసట

ప్రకృతికి, సకల జీవకోటికి ప్రాణప్రదమైన చెట్లను కూల్చివేయడం ఎంతటి ఘోర విపత్తులకు దారితీస్తుందో ఇటీవలి ఉత్తరభారతంలోని పలు రాష్ట్రాలను బెంబేలెత్తిస్తున్న వరద విలయాలను చూస్తే ఎవరికైనా అవగతమవుతుంది. మానవాళి మనుగడకు ప్రాణం పోసే వృక్షాలను నరికిపారేస్తే ఏమవుతుందో ఆ జలప్రళయాలు మన కళ్లకు కడుతున్నాయి. ఎవరి చిత్తానుసారం వారు విచక్షణా రహితంగా తమ స్వార్థ ప్రయోజనాల కోసం అడవుల్లో ఉన్న చెట్లను సైతం నరికేయడం వల్ల ప్రకృతి విపత్తులను అడ్డుకునే శక్తిలేక మానవుడే అసహాయుడైపోతున్నాడు. చేతులారా కొని తెచ్చుకున్న ప్రకృతి విపత్తులతో మనిషి తనకు తనే కుదేలైపోతున్నాడు. ఈ నేపథ్యంలో కేవలం చెట్ల నరికివేత వల్లనే తరచూ వరదలు, విపత్తులు సంభవిస్తున్నాయని ఇటీవల ఉత్తరాది రాష్ట్రాల్లోని జలవిలయాలకి అదే ప్రధాన కారణమని సాక్షాత్తూ సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) అభిప్రాయపడడమే కాక, ప్రజలు వరదల్లో చిక్కుకుపోతున్న ఘటనలపై ఆగ్రహంతో పాటు ఆవేదన కూడా వ్యక్తం చేసింది. చెట్ల నరికివేతలకు ఇకనైనా స్వస్తి పలకాలంటూ స్పష్టంగా సూచించింది. చెట్ల నరికివేతను నియంత్రిస్తూ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని కూడా ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో పాటు, కేంద్ర పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పులు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థలకు నోటీసులు కూడా ఇచ్చిందంటే, ఈ విషయమై సుప్రీం కోర్టు ఎంత సీరియస్‌గా ఉందో అర్థమవుతుంది.

భారీ వర్షాలు వరదలతో ఉత్తరభారతదేశం ఇటీవల అల్లాడిపోతోంది. ఉన్నట్లుండి వరదలు రావడం, కొండ చరియలు విరిగిపడడం, పెద్దఎత్తున ప్రాణనష్టం, ఆస్తినష్టం కలుగుతుండడం జరుగుతూనే ఉంది. ప్రత్యేకించి ఉత్తరాఖండ్‌లో మేఘవిస్ఫోటనం జరిగి ఆస్తినష్టాలే కాక భారీ సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు కూడా. పంజాబ్‌ను వరదలు వణికిస్తుంటే, హిమాచలప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కొండచరియలు విరిగిపడి ఘోరప్రమాదాలకు దారితీస్తున్నాయి. జమ్ము కశ్మీర్ నుంచి ఢిల్లీ దాకా ఒకటే వానలు, వరదలు వస్తుండడంతో జనజీవనం అల్లకల్లోలంగా మారింది. ఢిల్లీలో యమునానది ఉధృతంగా ప్రవహిస్తోంది. పలు రాష్ట్రాల్లోని ప్రజలు జలప్రళయాలతో జలదిగ్బంధనలో చిక్కుకుపోయారు. ఇటీవలే పంజాబ్, జమ్ముకశ్మీర్, హిమాచలప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రకృతి విలయం అంతా ఇంతా కాదు. కొండచరియలు విరిగి పడుతుండడంతో అక్కడున్న రోడ్డు మార్గాలన్నీ అస్తవ్యస్థంగా మారిపోయాయి. ముఖ్యంగా ఆయా రాష్ట్రాల్లోని కొండప్రాంతాల్లో జరుగుతున్న ప్రకృతి విధ్వంసం, పెద్దపెద్ద వృక్షాలను సైతం నరికివేయడం వంటివి మానవునికి ఓపలేని విపత్తులు తెచ్చిపెడుతున్నాయనేది సుస్పష్టం. అదే విషయాన్ని మరింత విస్పష్టంగా ఇటీవల సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. చెట్ల నరికివేత వల్లనే వరద విలయాలు వస్తున్నాయని అంటూ, వరదనీటిలో కుప్పలు తెప్పలుగా కొట్టుకువస్తున్న చెట్ల దుంగలు అందుకు ఉదాహరణగా పేర్కొంది. పర్యావరణ పరిస్థితులు ఇంతగా క్షీణిస్తుండడతో దాఖలైన ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీం ధర్మాసనం తన అభిప్రాయాలను సూటిగా తెలియజేస్తూ, చెట్ల నరికివేత తీవ్రమైన విషయమని కూడా మండిపడింది. ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాల్లో విపత్తుల నెదుర్కొంటున్న రాష్ట్రాల ప్రభుత్వాలు ఈ అంశాలపై సంజాయిషీ ఇవ్వాలని సుప్రీం ఆదేశించింది. కొండ ప్రాంతాల్లో కూడా అభివృద్ధి జరగాల్సిందే కానీ పర్యావరణం పాడైపోకుండా చూడాల్సిన బాధ్యత ఉంది కదా అని ప్రశ్నించింది. పర్యావరణానికి, అభివృద్ధికి మధ్య సమతుల్యత దెబ్బతినకుండా చూడాలని చెప్తూ, ఇదెంతో సీరియస్ విషయం కనుక ఈ కేసును మరో రెండు వారాల్లో మళ్ళీ విచారిస్తామని కూడా సుప్రీం స్పష్టం చేసింది. అందుకే, మన పెద్దలు 'వృక్షో రక్షతి రక్షిత:' అన్నారు. వృక్షాలను మనం కాపాడుకుంటే అవే మనల్ని కాపాడుతాయని దాని భావం. ఇకనైనా, దేశంలోని అన్ని రాష్ట్రాలూ కళ్లు తెరచి, చెట్లను విచక్షణా రహితంగా నరికివేయడాన్ని పూర్తిస్థాయిలో అరికట్టాలి. చెట్లను నరికి ధనార్జన చేసే అక్రమార్కుల పనిపట్టాలి. అవసరమైతే మరింత కఠినమైన చట్టాలను తెచ్చయినా సరే, చెట్లను కాపాడుకోవాలి. దేశమంతా విస్తారంగా మొక్కలు నాటి పర్యావరణానికి జీవం పోయాలి. అనేక రాష్ట్రాల్లో చెట్లు విధ్వంసానికి గురవుతున్న ఈ దశలో చెట్లకు బాసటగా... ప్రాణరక్షణగా ఉంటూ సుప్రీం చేసిన వ్యాఖ్యానాలు అద్భుతం. సుప్రీం ఆదేశాలు అన్ని రాష్ట్రాలకూ ఆచరణీయాలు..అనుసరణీయాలు కూడా!..

# అయ్యో.. మన నెల్లూరు!




ఇటీవల వార్తలలో నెల్లూరు గురించి చదువుతుంటే చాలా బాధ కలిగింది. ఇది మేము పెరిగిన నెల్లూరేనా అన్న అనుమానం వచ్చింది. మా ఇల్లు పొగతోటలో ఉండేది. నేను, మా తమ్ముడు చిన్నతనంలో మునిసిపల్ స్కూల్‌లో చదువుకున్నాం. ఆరవ తరగతి నుండి వి.ఆర్. హైస్కూలు, ఆ తరువాత వి.ఆర్.కాలేజీ, విద్యానగర్ ఎన్.బి.కే.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీలలో మా చదువులు సాఫీగా గడచిపోయాయి. మేము కాలేజీలో చదివే రోజుల్లో కూడా విద్యార్థి యూనియన్ ఎన్నికలు జరిగేవి. ఆ సమయంలో చిన్నచిన్న గొడవలు కూడా జరిగేవి, అవన్నీ మేము సరదాగా తీసుకునేవాళ్ళం. అప్పట్లో జిల్లా రాజకీయాలు కూడా చాలా ప్రశాంతంగా ఉండేవి. రౌడీయిజం పెద్దగా కనిపించేది కాదు. దౌర్జన్యాలు, కొట్లాటలు బహు అరుదు. నేరపూరిత వాతావరణం ఉండేది కాదు. నాయకులు ఎన్నికల సమయంలో పరస్పరం విమర్శించుకున్నా, ఫలితాల అనంతరం చాలా హుందాగా నడుచుకునేవారు. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితులు పూర్తిగా మారిపోయినట్లు కనిపిస్తోంది. నెల్లూరు ఇంత మారిందా..? అని ఆందోళన కలుగుతోంది. మేము నలభై ఏళ్ళుగా అమెరికాలో స్థిరపడ్డాం. కానీ, ఇప్పటికీ నెల్లూరుకి వస్తే ఏదో తెలియని అనుభూతి. చిన్ననాటి మధుర స్మృతులన్నీ గుర్తుకి వస్తాయి. అది మేం పుట్టిన వూరు, మేం పెరిగిన ప్రాంతం, అవి మేం తిరిగిన వీధులు, అందుకే నెల్లూరంటే మాకు పిచ్చి. నెల్లూరుకి రావాలంటే ఇష్టం. నెల్లూరంటే మాకు ప్రాణం. అలాంటి నెల్లూరు నేరాలకి, ఘోరాలకి, దౌర్జన్యాలకి, దుర్మార్గాలకి నిలయంగా మారిందని వింటుంటే "అయ్యో మన నెల్లూరు"... అని దిగులేస్తోంది!

**పి.ఎస్.రెడ్డి** - యు.ఎస్.ఏ

# అవును... అది శోచనీయమే!

సుప్రసిద్ధ సినీ గాయకులు, గాన గంధర్వులు డాక్టర్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం గారి విగ్రహం లేదా స్మారకం ఇప్పటివరకూ నెల్లూరులో ఏర్పాటు చేయలేకపోవడం నిజంగా శోచనీయమే. బాలూ గారికి నెల్లూరంటే ప్రత్యేకమైన ప్రేమ. చాలా ఇంటర్వ్యూలలో తన జన్మభూమి నెల్లూరు గురించి, నెల్లూరులో తన బాల్యస్మృతుల గురించి, నెల్లూరులోని తన మిత్రుల గురించి చెప్పారు. తన పుట్టినరోజు సందర్భంగా ఆయన ప్రవేశపెట్టిన లక్ష రూపాయల అవార్డు ప్రదానోత్సవానికి కూడా బాలూ గారు నెల్లూరు పురమందిరాన్నే వేదికగా చేసుకున్నారు. అనేకమంది ప్రముఖులని నెల్లూరుకి రప్పించి అవార్డు ప్రదానం చేశారు. నెల్లూరుపై అంతటి అపారమైన ప్రేమాభిమానాలు వున్న బాలూ గారిని నెల్లూరు పెద్దలు, నేతలు, సంగీతప్రియులు, బాలుగారి అభిమానులు మర్చిపోవడం దారుణమైన విషయం. పెద్దలు భారతదేశ మాజీ రాష్ట్రపతివర్యులు ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు, వదాన్యులు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారు, మునిసిపల్ మంత్రివర్యులు పొంగూరు నారాయణ గారి లాంటివాళ్ళు శ్రద్ధచూపించి నెల్లూరుజిల్లా గర్వించదగిన మహానుభావుడు బాలూ గారి విగ్రహం, స్మారకం సముచిత స్థానంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

**సి. హెచ్. భాస్కరరెడ్డి** - చిలకలూరిపేట.




## అనుమానాలు, అపోహలు, ఆధిపత్య ధోరణితో

# కూలిపోతున్న కుటుంబ వ్యవస్థ!

ఉక్కు గోడ కంటే బలమైనదనుకుంటున్న భారతీయ కుటుంబ వ్యవస్థ, ఇప్పుడు తాటాకుల తడికకంటే ఘోరంగా తయారైపోతోంది. మనం ఆధునిక కాలంలో జీవిస్తున్నామంటూ మనకి మనం గొప్పగా పొగుడుకుంటున్నా, కుటుంబాల్లో ప్రేమతత్వం మాత్రం నానాటికీ అడుగంటిపోతోంది. దీనికితోడు వివాహేతర సంబంధాలపై మోజు పెరిగిపోవడం, తద్వారా అనుమానపు పిశాచాలు జడలు విప్పుకుని వీరంగం చేస్తుండడం, చివరికి ఆ కాపురాలు పేకమేడల్లా కూలిపోవడం నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. రానురాను ఆనందాలు ఆవిరైపోయి, తగవులు ఘర్షణలు, సూటిపోటి మాటలు, హింసాత్మక ఘటనలతో కుటుంబాలు శోకసంద్రాలుగా మారుతున్నాయి. మొన్నటికి మొన్న ప్రకాశం జిల్లాలోని ఓ కుటుంబంలో ఏం జరిగిందో తెలియదు కానీ, భార్యతో గొడవపడి కన్నతండ్రే తమ ముగ్గురుబిడ్డలను పురుగుల మందు తాగించి, వారు చనిపోయిన తర్వాత పెట్రోల్ పోసి తగలబెట్టేశాడని, చివరికి తాను కూడా ఆ మందే తాగి ఆత్మహత్య చేసుకున్నాడని వచ్చిన కథనాలు ప్రజల హృదయాలను కలచివేశాయి. అదేవిధంగా, సమాజానికి దిక్సూచిగా ఉండాల్సిన ఓ ఐఏఎస్ అధికారి పక్కదారి పట్టి వివాహేతర సంబంధం పెట్టుకుని, ఆమె మీద కూడా అనుమానంతో కొట్టాడని, దాంతో ఆమె గాయాలపాలై చచ్చిపోయిందని, ఓ దినపత్రికలో వచ్చిన కథనం సామాన్యప్రజలను కూడా ఆందోళనకు గురిచేయడమే కాకుండా ఆలోచింపచేస్తోంది. మన కుటుంబవ్యవస్థ క్రమేణా కుదేలైపోతుందనడానికి ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు.

## పాతరోజులు కాదివి.. రోతరోజులు!

"మెగుడూ పెళ్ళాలన్నాక కోటి సమస్యలుంటాయి. వాళ్ళ మధ్య ఎన్నున్నా వాళ్ళే మళ్లీ ఒక్కటైపోతుంటారు. మధ్యలో ఎవరూ వెళ్ళకండి" అనేవారు మన పెద్దలు. నిజంగానే, ఎన్ని సమస్యలున్నా భార్యాభర్తలు ఒకటిగానే కలిసిపోతుండడం మన భారతీయ కుటుంబ వ్యవస్థలో ఒక పెద్ద ఆచారం, అద్భుతం కూడా ..! అయితే, ఆ పాతరోజులెప్పుడో పోయాయి. ఒకరంటే ఒకరికి నమ్మకం లేని అనుమానపు రోతరోజులొచ్చేశాయి. అరచేతిలోకి ఫోన్లు వచ్చాక, పగలూ రాత్రి వాటితోనే కాపురం. ఎవరి లోకం వారిదైపోయింది. నాటి ప్రేమలకి విలువలకి కూడా ఇప్పుడు చోటుండడం లేదు. భార్యాభర్తల్లో ఒకరంటే ఒకరికి ఏమాత్రం గౌరవం ఉండడం లేదు. ఒకరి మాట మరొకరు వినే పరిస్థితే ఉండడం లేదు. నీ సంపాదన కంటే నా సంపాదనే ఎక్కువనే అహంకారతత్వం పెరిగిపోతుండడంతో ఆలూమగల మధ్య నిజమైన ప్రేమాభిమానాలు మాసిపోతున్నాయి. కలహాలు వచ్చినప్పుడు సర్దిచెప్పి కాపురాలను నిలబెట్టే బంధువులు, తల్లిదండ్రులు కూడా ఇప్పుడు కరువైపోతున్నారు. ఈ నేపథ్యంలో తమ మానసిక బాధల్ని ఎవరికీ చెప్పుకోలేక చాలామంది ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. ఇలాంటి దుర్లక్షణాలన్నీ ఇటీవలి కాలంలో చాపకింద నీరులా చేరి, కుటుంబవ్యవస్థని నిలువునా ముంచేస్తున్నాయి. అయితే, ఈ అవస్థలన్నీ మనకు మనమే చేతులారా కొని తెచ్చుకుంటున్నవే. జీవితం ఎంత విలువైనదో, బతికే ఈ కొద్దికాలంలో ఏం సాధిస్తున్నామో, ఏం కోల్పోతున్నామో తెలుసుకోవడం లేదు. లేనిపోని అనుమనాలతోనే మన జీవితాల్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. అనవసరపు అపోహలతో అబాసు పాలవుతున్నాం.

## అనుమానం నిజంగానే పెనుభూతం!..

'అనుమానం పెనుభూతం' అన్నది పెద్దల మాట. ఒకసారి అనుమానం అన్నది పుడితే అది నిజంగానే పెను భూతంలా వెంటాడి వేటాడుతుందని విజ్ఞులు ఎంతో అనుభవంతో చెప్పారు. నేటికీ ఆ మాటలే నిత్యసత్యాలుగా మన కళ్ళముందు కనిపిస్తున్నాయి. చాలా కుటుంబాల్లో గతంలో ఉన్న ఆప్యాయతానురాగాలు ఇప్పుడసలు కనిపించడం లేదు. భార్యపై భర్తకు అనుమానం, భర్తపై భార్యకు అనుమానం. ఎవరితోనైనా నవ్వుతూ మాట్లాడినా అనుమానమే. స్నేహంగా ఎక్కడికైనా వెళ్ళినా వారి మధ్య ఏం జరిగిపోతుందోనన్న అనుమానమే. ఈ అనుమానాలే మనసుల్ని దహించివేస్తుంటాయి. సమాజం పట్ల, కుటుంబం పట్ల సరైన అవగాహన లేకపోవడమే వీటన్నిటికీ ప్రధాన కారణం.

నిర్లక్ష్యం, నిర్బాధ్యతలతో వ్యవహరించడం, పెడసరంగా తయారవడం వంటివన్నీ ఇప్పుడు ఒకరు నేర్పాల్సిన అవసరం లేదు. వాటంతటవే మన మనసుల్లోకి వచ్చేస్తున్నాయి. పెళ్లయి ఏళ్ళు గడిచిపోతున్నా, పిల్లలు పుట్టి, వారికీ పెళ్ళిళ్ళయి, వారికి కూడా పిల్లలు పుట్టి పెరుగుతున్నా, ఒకరిపై ఒకరు ఇంకా అనుమానాలతోనే ఉంటూ జీవితాలను దు:ఖపూరితం చేసుకుంటున్న దంపతులు నేటికీ కొల్లలుగా ఉంటున్నారు. బంధాలు, అనుబంధాలు, రక్తసంబంధాల పట్ల, కుటుంబ బంధాల పట్ల అభిమానం కొరవడడంతోనే ఈ దుష్పరిణామాలు. ప్రేమతత్వానికి బదులు ప్రతీకారతత్వాన్ని ప్రేరేపించే సినిమాలు, సీరియళ్ల ప్రభావం అనేకమంది జీవితాలని అధోగతిలోకి నెట్టేస్తోంది. భార్యా భర్తలు ఓర్పు, నేర్పుతో వారి జీవితాలని వారే చక్కదిద్దుకోవాలి. ఎక్కడ తప్పిపోతున్నామో తెలుసుకుని పొరపాట్లు సరిదిద్దుకోవాలి. పవిత్రమైన భార్యాభర్తల బంధానికున్న ప్రాధాన్యతను తెలుసుకోవాలి. లేకుంటే జీవితాలు నరకప్రాయమే అవుతాయి. భార్యాభర్తలు ఒకరికొకరు అవగాహనతో ఉండకపోతే, పిల్లలతో పాటు, మొత్తంగా ఆ కుటుంబాలే అల్లకల్లోలమవుతాయి. చివరికి సమాజానికీ, దేశపురోగతికీ మూలస్తంభమైన మన మహోన్నత కుటుంబవ్యవస్థే ఛిద్రమైపోతుంది!...

**- రాజశ్రీ**

# శ్రీసిటీలో.. 'చెన్నై ఏంజిల్స్' ప్రతినిధులు



చెన్నై ఏంజిల్స్ సంస్థకు చెందిన 19 మంది సభ్యుల ప్రతినిధి బృందం ఇటీవల తమ రెండు రోజుల పర్యటనలో భాగంగా శ్రీసిటీని సందర్శించింది. కె.మహాలింగం నేతృత్వంలోని బృంద సభ్యులకు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ గురించి వివరించారు. 2009లో ఏర్పాటైన చెన్నై ఏంజిల్స్ సంస్థ, స్టార్టప్‌లను ప్రోత్సహించడం, వాటి వృద్ధిని వేగవంతం చేయడంలో అపార వ్యాపారానుభవం కలిగివుంది. పర్యటనలో భాగంగా, ప్రతినిధి బృందం ఇదే సమయంలో శ్రీసిటీ సందర్శనలో ఉన్న పద్మశ్రీ డాక్టర్ టి.హెచ్. హనుమాన్‌చౌదరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శ్రీసిటీ ఎం.డీ, ఇతర అధికారులతో సమావేశమైన చెన్నై ఏంజెల్స్ ప్రతినిధి బృందం, శ్రీసిటీ కార్యకలాపాలు, పెట్టుబడి సామర్థ్యం, వ్యాపార అవకాశాలపై లోతైన అవగాహన పొందారు. డైకిన్, ఇసుజు, కోల్గేట్, ఎప్యాక్, ఎవర్‌వోల్ట్, సీఇటీసి తదితర ప్రముఖ కంపెనీలను వారు సందర్శించారు.

## పారిశ్రామిక వాతావరణం భేష్! - విశాఖ సెజ్ జోనల్ డీసీ ప్రశంస

శ్రీసిటీలోని పారిశ్రామిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం ఎంతో సంతృప్తికరంగా ఉన్నాయని, అందుకు శ్రీసిటీ యాజమాన్యం తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయమని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్(విఎస్ఇ) జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ ప్రశంసించారు. ఇటీవల ఆయన శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో, జాతీయ అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలతో సెజ్, డీటీజెడ్ కార్యకలాపాలు, భారీ టర్నోవర్, ఎగుమతులతో ప్రధాన ఆర్థిక ఇంజిన్‌గా శ్రీసిటీ స్థిరమైన పురోగతిని సాధిస్తోందని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. అలాగే, సెజ్ విధి విధానాల గురించి శ్రీసిటీ సెజ్‌లో ఇంక్యుబేషన్ సెంటర్ డీ-నోటిఫికేషన్ ప్రక్రియ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. తొలుత, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్



రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. విశాఖ సెజ్ ఏడీసీ ప్రసన్న కుమార్, ఎస్ఓ కిషోర్‌కుమార్, శ్రీసిటీ సెజ్ ఏడీసీ రామ్మోహన్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన టెలికాం ప్రముఖుడు



భారతదేశ టెలికాం ప్రముఖుడు, వీఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మెన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్‌చౌదరి ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ఆవిర్భావం, ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. డాక్టర్ చౌదరి సందర్శన తమకు అత్యంత గౌరవప్రదం అంటూ డా. సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. భారతదేశ టెలికాం విప్లవంలో ఆయన మార్గదర్శక పాత్ర ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. 94 ఏళ్ళ వృద్ధాప్యంలోనూ ఎంతో ఉత్సాహంతో ఆయన శ్రీసిటీ పర్యటనకు రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వారి విలువైన సలహాలు, సూచనలు శ్రీసిటీ అభివృద్ధికి మరింత ప్రయోజనకరమన్నారు. ప్రపంచశ్రేణి పారిశ్రామిక కేంద్రంగా శ్రీసిటీని రూపుదిద్దడంలో, దాని ఏర్పాటులో డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దార్శనికతను ఈ సందర్భంగా డాక్టర్ చౌదరి అభినందించారు. 31 దేశాలకు చెందిన 240కి పైగా గ్లోబల్ కంపెనీలు, 65 వేల మందికి ఉపాధి కల్పనతో బలమైన ఆర్థికశక్తిగా ఎదుగుతున్న శ్రీసిటీ ప్రగతిని ఆయన ప్రశంసించారు. శ్రీసిటీ సందర్శన ఒక అద్భుతమైన అనుభూతిగా పేర్కొన్నారు. అనంతరం, శ్రీసిటీ పరిశ్రమల సీఈఓల సమావేశంలో పాల్గొన్న డాక్టర్ చౌదరి, 'మేధో సంపత్తి, జగద్గురు భారత్' అనే అంశంపై ప్రసంగించారు. ప్రపంచ నాయకత్వం కోసం భారతదేశ వ్యూహాత్మక చట్రాన్ని ఆయన వివరించారు.

## 'స్మైల్ ఎకో' పరిశ్రమ ప్రారంభం

వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే 'స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్' నూతన పరిశ్రమ ఇటీవల శ్రీసిటీలో ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మెన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్‌చౌదరి ముఖ్య అతిధిగా పాల్గొని, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున పరుచూరి సమక్షంలో పరిశ్రమను ప్రారంభించారు. ఈ ప్లాంట్ ఏడాదికి 259.2 మిలియన్‌ల శానిటరీ న్యాప్‌కిన్‌లను తయారు చేస్తుంది. ఇందులో సుమారు 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి కూడా. స్థానిక ఉపాధి మరియు మహిళల ఆరోగ్య అవసరాలకు ఇదెంతో దోహద



పడుతుందని, ఈ ఉత్పత్తులు దేశీయంగానే కాక, విదేశాలకు ఎగుమతులు చేస్తారని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. స్థానికుడు, అప్పట్లో శ్రీసిటీ ఉద్యోగిగా ఉన్న వ్యక్తే నేడు పారిశ్రామికవేత్తగా మారడం విశేషమంటూ ఈ సందర్భంగా 'స్మైల్ ఎకో' ఎం.డీ మల్లికార్జునను డాక్టర్ సన్నారెడ్డి అభినందించారు. మల్లికార్జున పారిశ్రామిక ప్రస్థానం స్థానిక యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. ఈ ప్రాంతం నుంచి ఇంకా పలువురు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ టెలికం సంస్కరణలలో ప్రముఖపాత్ర వహించిన మహోన్నత వ్యక్తి హనుమాన్ చౌదరి చేతులమీదుగా ఈ పరిశ్రమ ప్రారంభం కావడం శుభపరిణామం అని వ్యాఖ్యానించారు.



# కసుమూరు దర్గాకు పూర్వవైభవం తెస్తాం

### ఎమ్మెల్యే సోమిరెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్

మతసామరస్యానికి ప్రతీకగా, కులమతాలకు అతీతంగా దేశవ్యాప్త ఖ్యాతినిగన్న దర్గాగా కసుమూరు మస్తానయ్య దర్గా సర్వేపల్లి నియోజకవర్గంలో ఉండడంలో మనందరి అదృష్టమని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ దర్గాకు పూర్వవైభవం తెస్తామని, ఆధ్యాత్మికంగానూ, పర్యాటక ప్రాంతంగాను దర్గాను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల ఆయన రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్‌తో కలసి మస్తానయ్య దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ నలుమూలల నుంచి ఈ దర్గాకు వేలసంఖ్యలో భక్తులు వస్తుంటారని, భక్తులకు కొరత లేకుండా తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కసుమూరులోని కళ్యాణ మండపాన్ని పునర్నిర్మించి సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు, దర్గా అభివృద్ధికి పలు హామీలు ఇచ్చిన అజీజ్‌కి ఆయన ధన్యవాదాలు తెలిపారు. భక్తులకు వసతి కల్పించేందుకు గదుల నిర్మాణం చేపడతామని, మహిళల కోసం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. త్వరలోనే రోజూ మధ్యాహ్నం సమయంలో భక్తులకు అన్నదానం ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు. అంతేకాక, కసుమూరు దర్గాలో అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేపట్టి భక్తులకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామని అబ్దుల్ అజీజ్ తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా కసుమూరుకు వచ్చిన అబ్దుల్ అజీజ్‌కు స్థానిక టీడీపీ నాయకులు, ముస్లిం సోదరులు ఘనంగా స్వాగతం పలికారు.

## కాపుభవన్‌లో దొంగలుపడ్డారు

నెల్లూరులోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయం సమీపంలో ఉన్న కాపుభవన్‌లో ఇటీవల దొంగలుపడ్డారు. ఆ భవనంలోని ఏసీలను పగులగొట్టి అందులో ఉన్న రాగి తీగలను అపహరించుకువెళ్ళారు. వాటితో పాటు 8 సీలింగ్ ఫ్యాన్లు, విద్యుత్ తీగలు కూడా చోరీకి గురయ్యాయని, వాటి విలువ సుమారు 2 లక్షల వరకు ఉంటుందని బీసీ కార్పొరేషన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు రంగంలోకి దిగి దొంగల అచూకీ కోసం గాలింపు చేపట్టారు.

## పెద్దాసుపత్రిలో అన్నదానం

నెల్లూరు నగరంలోని ప్రభుత్వాసుపత్రి (పెద్దాసుపత్రి)కి వచ్చే రోగులకు, వారి సహాయకులకు ఆసుపత్రిలోని సత్యసాయి సేవా ట్రస్ట్‌లో స్థానిక వివేకానంద వాకర్స్ అసోసియేషన్‌వారు ఈనెల 8న అన్నదానం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ, తమ సంఘం సభ్యులు అహ్మద్‌హుస్సేన్ సేవా దృక్పథంతో ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సంఘం కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నాయకులు స్వర్ణ రమేష్‌బాబు, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు న్యాయం చేయండి

• జేసీకి వినతి

ఆటో కార్మికులను న్యాయం చేయాలంటూ రోడ్ రవాణా కార్మికుల సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 8న జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కి ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రతి డ్రైవర్‌కి ఏడాదికి రూ.20వేల వంతున ప్రభుత్వం సాయం అందజేసేలా చర్యలు తీసుకోవాలని, ఆటో కార్మికుల సంక్షేమం కోసం బోర్డును ఏర్పాటుచేయాలని నాయకులు సురేష్, రాజు, సుధాకర్, రవీంద్ర, పెంచలయ్య, వెంకటేశ్వర్లు ఆ వినతిలో విజ్ఞప్తిచేశారు.

## ఎండలు.. తాటతీస్తున్నాయ్

సెప్టెంబరు నెలలో కూడా మే నెలలాగానే మండిపోతోంది. గత వారం రోజులుగా ఎండలు తాటతీస్తున్నాయి. ఉదయం 8 నుంచే భగ్గుమంటున్నాయి. ఇక మధ్యాహ్నమైతే ఇళ్లనుంచి బయటకు రావడానికి భయమేస్తోంది. సాయంత్రం అయిదయినా ఎండ వేడిమి చల్లారడం లేదు. 38 నుంచి 40డిగ్రీలకు పైగానే మిడిమేళంగా ఎండ కాస్తోంది. పగలంతా ఉక్కపోతతో, రాత్రైతే సెగలు, పొగలతో వాతావరణం వేడెక్కిపోతుండడంతో చిన్నారులు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వానలేమో రావడానికి సిద్ధంగా ఉన్నాయని, వానలు కాదు ఏకంగా తుఫానే వచ్చే అవకాశం ఉందని కూడా వాతావరణ శాఖ వారు చెప్తున్నారు. మంచిదే! వానలొస్తే తప్ప జనానికి ఉపశమనం ఉండదు. తుఫానులొద్దు కానీ, వానలు కురిస్తే మేలే కదా!...

• విపిఆర్ ఫౌండేషన్ ఔదార్యం

# పేద విద్యార్థినికి లక్ష సాయం



గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైష్ణవి అనే విద్యార్థినికి ఇటీవల విపిఆర్ ఫౌండేషన్ ద్వారా లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని అందజేశారు. నెల్లూరు నగరం పడారుపల్లికి చెందిన వైష్ణవి గతంలో విపిఆర్ విద్యా సంస్థల్లో చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణురాలైంది. విపిఆర్ విద్యాసంస్థల్లో ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువులను ప్రోత్సహిస్తూ ఆర్థిక సహాయం అందచేసే ఆనవాయితీ ఉండడంతో, ఆమేరకు వైష్ణవికి విపిఆర్ సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇటీవల ఆమేరకు సాయం అందించారు. తన చదువులకు ఎంతో సాయపడుతున్న విపిఆర్ దంపతులకు వైష్ణవి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపింది.

# మార్గదర్శకులు ఉపాధ్యాయులే!

— విశ్రాంత రెవెన్యూ అధికారి పెంచలరెడ్డి



సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని విశ్రాంత రెవెన్యూ అధికారి సీహెచ్ పెంచలరెడ్డి చెప్పారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరులోని క్రాంతినగర్ మునిసిపల్ స్కూల్లో సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ వారు నిర్వహించిన డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిజాయితీ, నిబద్ధత, నిస్వార్థంతో పనిచేసి, సమాజానికి ఉపకారం చేసే విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే శక్తి ఒక్క ఉపాధ్యాయులకే ఉందని ఆయన అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వేలాదిమంది విద్యార్థులను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. భువనేశ్వరిప్రసాద్, జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ, గోవిందరాజుల సుభద్రాదేవి, సర్వేపల్లి శివకుమార్, సతీష్‌చంద్ర, రాధాకృష్ణ, వాసుదేవరావు పాల్గొన్నారు.

# అక్షరాస్యత సాధించాలి

అక్షరాస్యతను సాధించాలని ప్రజాసత్తా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శోభన్‌బాబు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8న నెల్లూరులోని వేదసంస్కృత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలియజేశారు. ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ దయాకర్, ముస్లిం సత్తా జిల్లా మహిళా అధ్యక్షురాలు షబానా, ప్రధానోపాధ్యాయుడు శర్మ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

కలెక్టర్‌ని కలసిన..

# రెవెన్యూ సంఘం నాయకులు



కొత్తగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ ఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు అల్లం పాటి పెంచలరెడ్డి, కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు ఈనెల8న జిల్లా కలెక్టర్ ఆనంద్‌ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూశాఖ గౌరవం పెరిగేలా ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఆ సంఘం నాయకులకు సూచించారు. సంఘం అసోసియేట్ అధ్యక్షుడు బొబ్బా మురళి తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను వెంటనే పరిష్కరించాలి

జిల్లా ఎస్పీ ఆదేశం



ప్రజల నుంచి వచ్చిన సమస్యల అర్జీలను వెంటనే సిబ్బంది పరిశీలించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 8న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 109 అర్జీలు రాగా, వాటిని విచారించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. న్యాయసలహాదారు శ్రీనివాసులురెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు, ఎస్‌బిడీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐటీఐలో జాబ్‌మేళా..

# 107 మందికి ఉద్యోగాలు



రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 8న నెల్లూరులోని ఐటీఐ కళాశాల ఆవరణలో జరిగిన జాబ్‌మేళాలో 107 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 15 కంపెనీల వారు పాల్గొని ఈ ఎంపికలు చేశారు. మొత్తం 211 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. ఎంపికైనవారికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, సుకుమార్‌లు పాల్గొని నిరుద్యోగులకు ఉద్యోగ నియామకపత్రాలను అందజేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం పర్యవేక్షించారు.

'విశ్వసాయి'లో..

# వేడుకగా ఉపాధ్యాయ దినోత్సవం



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి కళాశాలలో ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమం వేడుకగా జరిగింది. కళాశాల ఛైర్మన్ డా. ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ, డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజైన సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఉప రాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఆయన చాలామందికి తెలుసని, అయితే ఆయన మొదట ఉపాధ్యాయుడు, విద్యావేత్త అని తెలిపారు. ఉపాధ్యాయుడు రాష్ట్రపతి స్థానం అలంకరించడం ఉపాధ్యాయ వృత్తికే గర్వకారణమన్నారు. తొలుత, డా. రాధాకృష్ణన్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి, వారి సేవలను స్మరించుకున్నారు. అనంతరం, తమ గురువులుగా భావించే కళాశాల డైరెక్టర్లను విద్యార్థులు పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్.. గురుపూజోత్సవం



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఏసీ స్టేడియం ప్రాంగణంలో ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి నివాళులర్పించారు. అనంతరం, అసోసియేషన్‌లోని 36 మంది ఉపాధ్యాయులను అభినందించి శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, వాకర్స్ మాజీప్రెసిడెంట్.. ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ ప్రతినిధులు షేక్ నసీర్ అహ్మద్, బెల్లం చెంచయ్యనాయుడు, కొండూరు సుబ్బారావు, వినుకొండ వెంకటేశ్వర్లు, తలపనేని హరిబాబు, కిలారి మధుసూదనరావు, దొడ్డ జయరామనాయుడు, మన్నేపల్లి సురేష్, కె.వెంకటరమణ, లక్కాకుల శ్రీనివాసులు, పత్తిపాటి రమణయ్య, డి.దేవదానం పాల్గొన్నారు.

# తెరుచుకున్న ఆలయాలు

ఈనెల 7వ తేదీ ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ మూతబడ్డాయి. 7వ తేదీ అర్ధరాత్రి 1.26 గంటలకు గ్రహణం వీడిపోవడంతో, సోమవారం వేకువనే జిల్లాలోని ఆలయాల్లో సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి, తిరిగి యథావిధిగా ఆలయాలను తెరిచారు. పవిత్రజలాలతో ఆలయాలను, మూలవిరాట్‌లను శుద్ధిచేసి పూజలు చేపట్టారు. నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథాలయం, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం, మూలస్థానేశ్వరాలయం తదితర ఆలయాల్లో గ్రహశాంతి పూజలు జరిగాయి. గ్రహణశాంతికి దానాలు చేశారు.






# ఒకరి నేత్రదానంతో..ఇద్దరికి కంటిచూపు



ఒకరి నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపును ప్రసాదించవచ్చని, కనుక నేత్రదానంపై అందరూ అవగాహన కలిగించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత చెప్పారు. ఈనెల 8న నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా నేత్రదానం పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న పలువురిని సన్మానించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా.ఎం.శార్వాణి మాట్లాడుతూ, ఎవరైనా తమ మరణానంతరం 6 గంటల లోపు కళ్ళు దానం చేస్తే, వాటిద్వారా ఇద్దరు అంధులకు కంటిచూపును ప్రసాదించవచ్చని తెలిపారు. నేత్రదానం ఎంతో పుణ్యకార్యమని, ప్రజలు నేత్రదానం విశిష్టతను అర్థం చేసుకోవాలని కోరారు. నేత్రదాన మోటివేటర్లు వైవీ సుబ్బారావు, పీఎంపీ నాయకులు వేణుగోపాల్, చిరంజీవి ఐ బ్యాంక్ సుధీర్, బయ్యా ప్రసాద్, దేవళ్ల శ్రీనివాసులు, శ్రీవాణి, హేమలత, అభయ ఆర్గనైజేషన్, వాసవిలను అధికారులు ఘనంగా సన్మానించారు. అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎస్.ఖాదర్‌వలి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 11 సీట్లకే పరిమితమైన...

# వైకాపా తేరుకోలేకపోతోంది

### ➢ సోమిరెడ్డి విమర్శ



అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు వీలైనంత మంచి చేయడమే తమ లక్ష్యమని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. అలా కాకుండా నిత్యం ఇతరులపై నోరు పారేసుకోవడం, దివంగతులైన తల్లిదండ్రులను దూషించడం లాంటి పనికిమాలిన పనులు తమకు చేతకావని, ఆ పనులు చేసిన వారు ఎలాంటి ఫలితాలు అనుభవించారో అందరూ చూశారని ఆయన్నారు. తమ తల్లిదండ్రులతో పాటు చంద్రబాబునాయుడు తల్లిదండ్రులను ఉద్దేశించి వాడిన భాష జీవితంలో మరిచిపోలేమని, అది మనుషులు వాడే భాష కాదని అన్నారు. ముత్తుకూరులో ఇటీవల ఆర్.వై.ఎస్ ముత్తుకూరు ప్రీమియర్ లీగ్ సీజన్-6 టోర్నీ ప్రారంభోత్సవం సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, 2016 లోనే ముత్తుకూరులో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి భూమి మంజూరు చేయించామని, అయితే అప్పట్లోనే వైసీపీ నేతలు స్టేడియం నిర్మాణానికి అడ్డుతగిలారని తెలిపారు. ఇప్పుడు మరో స్థలంలో రూ. 2.50 కోట్లతో అదానీ కృష్ణపట్నం పోర్టు సహకారంతో స్టేడియం నిర్మించబోతున్నామన్నారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేయడంతో అయోమయ పరిస్థితిలో ఉన్న వైసీపీ నాయకులు ఇప్పుడు ధర్నాల పేరుతో డ్రామాలేస్తున్నారని ఆయన విమర్శించారు.


### ఢిల్లీలో కాళ్ల బేరం..
### ఏపీలో వీధి నాటకాలు

ఎరువుల కొరత పేరుతో వైసీపీ డ్రామాలపై సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఢిల్లీలో కాళ్ల బేరం చేస్తూ ఏపీలో వీధి నాటకాలాడుతోందని ఆయన విమర్శించారు. వైకాపా డ్రామాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఎరువుల సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు కేంద్ర మంత్రితో మాట్లాడి 50 వేల టన్నుల యూరియాను ఏపీకి కేటాయింపజేయడంలో విజయం సాధించారని ఆయన అన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతూ ముందుకు సాగుతోందన్నారు.

## తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో..



వెంకటాచలంలోని తెలుగు ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రంలో గిడుగు రామ్మూర్తి, కాళోజి నారాయణరావుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఇటీవల చేపట్టిన సెమినార్‌ను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రారంభించారు. మైసూరులో ఉన్న ఈ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చొరవతో మన సర్వేపల్లి నియోజకవర్గానికి వచ్చిందని ఆయన అన్నారు. ఈ కేంద్రంలో తెలుగు భాషాభివృద్ధికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన నిర్వాహకులను కోరారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో ఆ కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్, ఆచార్య ఆర్వీఎస్ సుందరం, ఆచార్య అల్లం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# అప్పసముద్రం బాధితులకు సీఎం సాయం

### ● కాకర్ల చొరవతో 9 మంది చిన్నారులకు 18 లక్షలు

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలో మూడవరోజు నిమజ్జనం కార్యక్రమంలో బాణసంచా పేలి 9మంది చిన్నారులకు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, తనవంతు ఆర్థిక సహాయం కూడా అందించారు. ఈ నేపథ్యంలో ఈనెల 9న కాకర్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి ప్రమాద విషయాన్ని వివరించగా, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి బాధితులైన ఒక్కొక్క చిన్నారికి రెండు లక్షల రూపాయల వంతున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. 9 మంది చిన్నారులకు 18 లక్షల రూపాయలను సీఎం సహాయ నిధి నుండి మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే కాకర్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ప్రముఖ వైద్యుడు రవి అవసరమైన చిన్నారులకు ప్లాస్టిక్ సర్జరీ చేసేందుకు కూడా ముందుకు వచ్చారని, అవసరమైనవారికి సర్జరీ చేయించేందుకు కూడా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

## వేణుగోపాలస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి..

# మంత్రి ఆనం కృషి

### ● చిన్నజీయర్‌స్వామితో సంప్రదింపులు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి..రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి ప్రారంభించారు. ఈనెల 9న హైదరాబాద్ ముచ్చింతల్‌లో ఉన్న శ్రీ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించి, శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనుల విషయమై స్వామీజీతో చర్చించారు. ఆలయంలో నిర్వహించే రోజువారీ కార్యక్రమాలు గురించి స్వామీజీకి తెలియజేసి సలహాలు సూచనలు తీసుకున్నారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీ గోదాదేవి ఆలయం, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం, ముఖ మండపం మరియు అనివేట్టి మండపం, పాకశాల, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, వాహనశాల, కార్యాలయ భవనం, రాజగోపురం, మహా మండపం, ఉత్తర ద్వార రాజగోపురం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయం తదితర విషయాలపై మంత్రి ఆనం చిన్నజీయర్ స్వామివారితో సంప్రదించారు. ఆలయ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన వాస్తు, ఆచార, భక్తి పరమైన అంశాలపై స్వామీజీ సూచనలు అందించారు.

## తెలుగుకు వెలుగులు తెచ్చిన...

# మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు

### ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి



తెలుగుకు వెలుగులు తెచ్చిన మహనీయుడు, తెలుగుజాతి గర్వించదగ్గ స్థాయిలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి మండలి వెంకట కృష్ణారావు అని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కొనియాడారు. ఇటీవల చెన్నై మైలాపూరులో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ వారిచే మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాగుంట శీనయ్య మాట్లాడుతూ, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణ ద్వారా మండలి వెంకట కృష్ణారావు తెలుగు రాష్ట్రంతో పాటు రాష్ట్రేతర ఆంధ్రులను, ప్రపంచ దేశాల్లో స్థిరపడిన తెలుగువారిని ఒకే వేదికపైకి తీసుకొని వచ్చి తెలుగువారి స్థాయిని, ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అధికార భాషా కమిషన్‌కు మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా కమిషన్ అని నామకరణం చేయటం ద్వారా ఆయన సేవలకు సముచిత గుర్తింపు, గౌరవం లభించాయన్నారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆధునీకరించిన గ్రంథాలయాన్ని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ పునః ప్రారంభించారు. తొలుత పొట్టి శ్రీరాములు విగ్రహానికి, మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా ఆచార్య సీఎంకె రెడ్డి, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీకవి భువన చంద్ర, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ అధ్యక్షులు కాకుటూరు అనిల్ కుమార్‌రెడ్డి, కార్యదర్శి మరియు కోశాధికారి వి.కృష్ణారావు, సంయుక్త కార్యదర్శి పూరా శశికళ, సభ్యులు డాక్టర్ విస్తాలి శంకరరావు, డాక్టర్ ఎం.వి. నారాయణగుప్తా, ఎం.ఎస్. లక్ష్మణరెడ్డి, డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్, గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ ఎ.వి. శివకుమారి, జె.ఎం. నాయుడు తదితరులు పాల్గొన్నారు.




## మాదకద్రవ్యాలు వాడితే..

# జీవితాలు నాశనమే!




మాదకద్రవ్యాలు వాడితే జీవితాలు నాశనమవుతాయని, విద్యార్థులు, యువత వాటి జోలికి వెళ్లవద్దని పొదలకూరు ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటేశ్వర్లు చెప్పారు. ఈనెల 8న పొదలకూరు కాకతీయ డిగ్రీ కళాశాలలో ఆయన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించి, మాదకద్రవ్యాలు ఎంత ప్రమాదకరమో వివరించారు. ఎక్సైజ్ ఎస్ఐ అయ్యప్ప మాట్లాడుతూ, విద్యార్థులు–యువత దురలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తుపదార్థాలు ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించవద్దని, శ్రద్ధతో చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. తల్లితండ్రులు కూడా తమ పిల్లల నడవడికను ఎప్పటి కప్పుడు గమనిస్తూ, వారిని మంచిదారిలో పెట్టాలన్నారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# వెంకటరెడ్డిపల్లి రోడ్డుకు మోక్షం!



ఎట్టకేలకు కలువాయి మండలంలోని సోమశిల వద్ద ఉన్న వెంకటరెడ్డిపల్లి రోడ్డుకు మోక్షం కలిగింది. గత కొంతకాలంగా ఈ రోడ్డు బాగా దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బంది గా ఉండేది. వాహనాలు తరచూ ఇరుక్కు పోయేవి. సోమశిలకు వెళ్ళాలన్నా, జాతీయరహదారి మీదికి పోవాలన్నా ఈ రోడ్డుమీద నుంచే వెళ్ళాలి. ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బి అధికారులు సుమారు 50 లక్షల రూపాయల వ్యయంతో రోడ్డు బాగుకు చర్యలు చేపట్టడంతో స్థానికులు సంతోషపడుతున్నారు.

## అల్లూరు 'పెద్దోడు'కి..

# జ్యూరీ బహుమతి

### విజయవాడ పోటీల్లో ఆంజనేయరాజు ప్రతిభ



విజయవాడలోని శ్రీ రామకృష్ణ నాట్యమండలి స్వర్ణోత్సవాల సందర్భంగా ఇటీవల రెండు రోజుల పాటు శ్రీ కేతా పూర్ణానంద కళావేదికపై పెద్దఎత్తున నిర్వహించిన ఏకపాత్రాభినయం పోటీల్లో నెల్లూరుజిల్లా అల్లూరుకు చెందిన ప్రముఖ కళాకారుడు బదబాగ్ని ఆంజనేయరాజు తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నాడు. 82 మంది ఉద్దండ కళాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో, తనే రాసుకుని, తనే మేకప్ వేసుకుని నటించే 'పెద్దోడు' ఏకపాత్రాభినయాన్ని ఆంజనేయరాజు అత్యద్భుతంగా ప్రదర్శించి జ్యూరీ బహుమతిని సొంతం చేసుకున్నాడు. గతంలో కూడా ఈ ఏకపాత్ర అనేక పరిషత్తుల్లో బహుమతులు పొందిన విషయం తెలిసిందే. గతంలో, సాక్షాత్తూ నాటి ముఖ్యమంత్రి, కళామతల్లి ముద్దుబిడ్డ ఎన్టీరామారావు సమక్షంలో ఈ ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించడం, ఎన్టీఆర్ చేతులమీదుగా అవార్డునందుకోవడం తెలిసిందే. దీంతో 'అల్లూరు పెద్దోడు'గా ఆంజనేయరాజు ప్రసిద్ధి చెందాడు. తాజాగా విజయవాడలో జరిగిన పోటీల్లో మాజీ మంత్రి, మాజీ ఉపసభాపతి, ప్రస్తుత శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా ఆయన ఈ బహుమతిని అందుకోవడం విశేషం. నాట్యమండలి నిర్వాహకులు శ్రీ జొన్నలగడ్డ జగన్మోహనరావు ఆ సంస్థ సభ్యులతో పాటు అనేకమంది కళాకారులు ఈ సందర్భంగా ఆంజనేయరాజును అభినందించారు.

# పొరుగున మళ్లీ మంటలు



నేపాల్‌లో చెలరేగిన అల్లర్లు మరోసారి దక్షిణాసియాను ఉలిక్కిపడేలా చేశాయి. అక్కడి ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై నిషేధం విధించడంతో మొదలైన నిరసనలు క్రమంగా హింసాత్మకంగా మారి, దేశ రాజకీయాల్లో పెద్ద మార్పుకు దారి తీశాయి. పోలీసులు–ప్రజల ఘర్షణల్లో దాదాపు 20 మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు, వందల మంది గాయపడ్డారు. చివరికి ప్రధానమంత్రి కె.పి. శర్మ ఓలి రాజీనామా చేయాల్సి వచ్చింది.

ఈ అల్లర్లలో అత్యంత విషాదకరమైన సంఘటన మాజీ ప్రధాని ఝలానాథ్ ఖనాల్ ఇంటిపై జరిగిన దాడి. ఆందోళనకారులు ఆయన ఇంటిని తగులబెట్టగా, భార్య మంటల్లో చిక్కుకొని మృతిచెందారు. ప్రధాని కె.పి. శర్మ ఓలి ఇంటికీ నిప్పు పెట్టారు. ఆయన తనను, తన కుటుంబాన్ని రక్షించాల్సిందిగా సైన్యాన్ని అర్థించారు. రాజీనామా చేస్తేనే రక్షించగలమని సైన్యం చెప్పిన మీదట ఆయన రాజీనామా చేశారు. అక్కడి పాలన సైన్యం పగ్గాల్లోకి వెళ్లింది. ఆర్థికమంత్రిని ఆందోళనకారులు రోడ్డుపై పరుగులు పెట్టించారు. మావోయిస్టు ఉద్యమంతో నేపాల్‌లో పెద్ద ఎత్తున రాజకీయ మార్పునకు బీజంవేసి ప్రధానిగా ఎదిగిన పుష్ప కమల్‌దహాల్‌నూ ఆందోళనకారులు వదల్లేదు. ఆయన ఆస్తులపైనా దాడి చేశారు. మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా, ఆయన సతీమణి, ప్రస్తుత విదేశాంగ మంత్రి అర్జురాణా దేవుబాలపై దాడి చేసి, గాయపర్చారు. ఇంకా పలువురు నాయకుల ఆస్తులను ధ్వంసం చేశారు. నాయకుల కుటుంబాలను కూడా రక్షించలేని స్థితి ఏర్పడినప్పుడు ప్రజాస్వామ్యపు మూలాలు కదిలిపోతున్నాయనడానికి మరింత సాక్ష్యం అవసరం లేదు.

ఇది కేవలం నేపాల్‌కే పరిమితం కాదని మనం అర్థం చేసుకోవాలి. మూడు సంవత్సరాల క్రితం శ్రీలంకలో ఇలాంటి పరిస్థితులు చూశాం. ఆర్థిక సంక్షోభంతో ప్రజలు వీధుల్లోకి వచ్చి అధ్యక్ష భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధ్యక్షుడు గోటబయ రాజపక్స దేశం విడిచి పారిపోవాల్సి వచ్చింది.




బంగ్లాదేశ్‌లో కూడా ఇలాంటి పరిస్థితినే మనం చూశాం. రిజర్వేషన్లు రద్దు చేయాలంటూ మొదలయిన ఆందోళనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. రిజర్వేషన్లను రద్దు చేసినా నిరసనలు ఆగలేదు. షేక్ హసీనా గద్దె దిగాల్సిందే అని నిరసనకారులు పట్టుబట్టారు. బాహ్యశక్తులు అగ్నికి ఆజ్యం పోశాయి. చివరకు ఆమె అర్ధరాత్రి భారత్‌కు పారిపోయి రావాల్సి వచ్చింది.

శ్రీలంక, బంగ్లాదేశ్, ఇప్పుడు నేపాల్... ఈ మూడు దేశాల్లో అల్లర్లు ఒకే సరళిలో జరిగినట్టుగా కనిపిస్తాయి. ప్రజల్లో ఆర్థిక సమస్యలపై అసంతృప్తి, ప్రభుత్వ నిర్ణయాలపై కోపం, సోషల్ మీడియా ద్వారా వేగంగా వ్యాప్తి చెందుతున్న వదంతులు.. ఇవన్నీ కలిపి ఒక పెద్ద అస్థిరతను సృష్టిస్తున్నాయి. ఈ సరళి అంతా కేవలం యాదృచ్ఛికమేనా అంటే.. కాదు అని ఘంటాపథంగా చెప్పలేం. దక్షిణాసియాను అస్థిరం చేయాలన్న ఒక కుట్ర జరిగి ఉండే అవకాశం కూడా ఉంది. ఈ మంటల్లో చలికాచుకునే శక్తులేవో మనం గుర్తించి జాగ్రత్తలు పడాలి.

భారతదేశం ఇలాంటి పరిణామాలను నిర్లక్ష్యం చేయలేదు. మనకు ఈ దేశాలతో దీర్ఘమైన సరిహద్దులు ఉన్నాయి. వాణిజ్యం, ఆర్థిక లావాదేవీలు, సాంస్కృతిక సంబంధాలు బలంగా ఉన్నాయి. కాబట్టి అక్కడి అస్థిరత మనకు మంచిది కాదు. ఈ సమయంలో భారతదేశం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. బహిరంగంగా జోక్యం చేసుకుంటే "భారతదేశం పెత్తనం చేస్తోంది" అన్న విమర్శలు చేయడానికి చాలా శక్తులు కాసుకుని కూర్చొన్నాయి. కానీ, మౌనం వహించడం కూడా సరైన మార్గం కాదు. మానవతా సహాయం, రక్షణ చర్యలు, అవసరమైనప్పుడు సరిహద్దు భద్రతను పెంపొందించడం వంటి పద్ధతులు అనుసరించాలి. వదంతులే పరిస్థితులను అదుపు తప్పేలా చేస్తాయి. శ్రీలంక, బంగ్లాదేశ్ అనుభవాల తర్వాత కూడా నేపాల్‌లో ఇదే తంతు పునరావృతమైంది. కాబట్టి భారతదేశం కూడా సమాచార భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సరిహద్దు ప్రాంతాల ప్రజలకు నమ్మదగిన వార్తలు అందించడమే కాకుండా, సోషల్ మీడియాలో వ్యాపించే తప్పుడు సమాచారాన్ని అడ్డుకునే విధానాలు అవలంబించాలి.

నేపాల్ రాజకీయాల అస్థిరత కొత్తది కాదు. గతంలో రాజవంశంలో జరిగిన హత్యాకాండ ఆ దేశాన్ని కుదిపేసింది. రాచరిక పాలన అంతమయిన తర్వాత కూడా అది రాజకీయ నిలకడను తీసుకురాలేకపోయింది. ఎన్నికల తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఎక్కువకాలం నిలవలేదు. అక్కడ రాజకీయాలు అస్థిరంగానే ఉన్నాయి.

ఈ ప్రాంతీయ అస్థిరతలను మనం కేవలం పొరుగింట్లో మంటలుగానే చూడకూడదు. అవి మన ఆర్థిక భద్రత, సరిహద్దు ప్రశాంతత, అంతర్జాతీయ ప్రతిష్టకు ముప్పుగా నిలుస్తాయి. కాబట్టి నిశ్శబ్ద దౌత్యం, మానవతా సహాయం, మరియు తగిన సమయంలో కఠినమైన చర్యలు... ఈ మూడు కలగలసిన వ్యూహం మాత్రమే భారతదేశానికి రక్షణగా నిలుస్తుంది. భారతదేశం స్పందన సమయోచితంగా, రక్షణాత్మకంగా, ప్రజాస్వామ్య విలువలను కాపాడేదిగా ఉండాలి. పొరుగు దేశాల్లో సుస్థిరమైన పాలనా వ్యవస్థలుండేలా భారత్ ప్రోత్సహించాలి. ఎందుకంటే దక్షిణాసియాలో స్థిరత్వం అంటే, భారతదేశ భద్రతే.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




# గిట్టుబాటు ధరకే ధాన్యం కొనాలి

### - ఆత్మకూరులో సీపీఐ డిమాండ్

ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలంటూ ఆత్మకూరు రైతులు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఈనెల 8న ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. సీపీఐ నాయకుడు వై.మధు మాట్లాడుతూ, గిట్టుబాటు ధరలు ఇవ్వని మిల్లర్లు, దళారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆత్మకూరు, సంగం మండలాల్లో ఈసారి వరిపంట దిగుబడి బాగా ఉందని, అయితే దళారులు, మిల్లర్లు మాత్రం రైతులను మోసం చేస్తూ తక్కువ ధరకే, కేవలం రూ.16వేలకే పుట్టి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఎంత గట్టిగా చెప్తున్నా, రైతులకు మాత్రం గిట్టుబాటు ధర దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పుట్టి ధాన్యానికి 19,760 రూపాయలను మద్దతు ధరగా ప్రకటించిందని, అంతకంటే తక్కువ ధరకు ధాన్యం కొనకూడదని వారు చెప్పారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు మరింత పటిష్టమైన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఆమేరకు ఆర్డీఓకి వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో సీపీఐ నగర నాయకులు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి..

జిల్లాలో వరికోతల సమయం వచ్చింది కనుక, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గంగపట్నం రమణయ్య ఈనెల 8న ప్రజావిజ్ఞప్తుల వేదికలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు షానవాజ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతలను ఆదుకోవాలి

### -కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ధర్నాందోళన-

జిల్లాలో ధాన్యానికి మద్దతు ధర కల్పించి అన్నదాతలను ఆదుకోవాలంటూ ఈనెల 8న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, ప్రధాన కార్యదర్శి గంగపట్నం రమణయ్యల ఆధ్వర్యంలో రైతులు ధర్నాందోళన నిర్వహించారు. పంటలు కోతకు వచ్చే సమయానికి మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతుల వద్ద నుంచి తక్కువ ధరకే ధాన్యం కొంటున్నారని, ఈ దోపిడీని అరికట్టాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో కూడా నెల్లూరు ధాన్యానికి మంచి డిమాండ్ ఉన్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఇకనైనా రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని వారు కోరారు.

# చింతలపాళెం నీటి వెతలు తీర్చాలి

వింజమూరు మండలం ఏ.కిస్టీపురం పంచాయితీలోని చింతలపాళెం గ్రామంలోని బీసీ కాలనీ వాసులు గత మూడు నెలలుగా తాగేందుకు గుక్కెడు మంచినీళ్లు దొరక్క అవస్థలు పడుతున్నారని, ఎన్నిసార్లు అధికారులకు చెప్పుకున్నా ఫలితం ఉండడం లేదంటూ గ్రామస్తులు ఈనెల 8న వింజమూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. తాము వెనుకబడిన వర్గాలకు చెందిన వాళ్ళం కనుక, స్థానిక నాయకులు తమ కష్టాలు వినిపించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం తమ కుటుంబాలు తాగేందుకు, ఇతర ఇంటి అవసరాలకు మంచినీళ్లు కూడా దొరక్కపోవడంతో గ్రామస్తులు అనేకమంది ఊరు విడిచి వెళ్లిపోతున్నారని వారు ఆవేదనతో తెలియజేశారు. జిల్లా ఉన్నతాధికారులైనా తమ గోడు పట్టించుకొని వెంటనే తాగునీటి సౌకర్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల్లో బోరు వేయించి సమస్య తీరుస్తామని ఎంపీడీఓ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

# ప్రజా సమస్యలపై పోరు సాగిస్తాం

## - రామ్‌కుమార్‌రెడ్డి



రాష్ట్రంలోని ప్రజల సమస్యలపై పోరు సాగిస్తామని వెంకటగిరి వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల ఆయన రైతు పోరు బాటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం 40 శాతం ఓటు బ్యాంకు సాధించిన వైయస్సార్సీపి బాధ్యత అన్నారు. రైతుల సమస్యలపై వినతి పత్రం అందించేందుకు వస్తే గూడూరు సబ్ కలెక్టర్, ఏఓ తదితర ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడం చూస్తుంటే ప్రతిపక్ష పార్టీ పోరాటాలకు ప్రభుత్వం భయపడుతున్నట్లు కనిపిస్తోందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం వైకాపా నిరంతర ప్రక్రియ అని, ఆంక్షలకు-కేసులకు భయపడబోమని అన్నారు. మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి రూ. 3వేలు అంటూ మాయమాటలతో గద్దెనెక్కి, ఇప్పుడు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల్లో వ్యతిరేకత తారాస్థాయికి చేరిందని ఆయన విమర్శించారు.

# ఘనంగా 'ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం'



ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలిచర్ల వారిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు "అక్షరం" ఆకారంలో ఏర్పడి చదువు ఆవశ్యకతను వినూత్నంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ శిక్షణ మండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేశిరెడ్డి ప్రజేంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8వ తేదీ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని జరుపుకుంటామని, దేశాల అభివృద్ధికి ప్రధానమైన కారణం చదువేనని, నిరక్షరాస్యత నిర్మూలనకు అందరూ కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా పెద్ద వయసు వారికి, వయోజన విద్య, సార్వత్రిక విద్య ఆవశ్యకతపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.అనసూయ, జి.మాధవయ్య, బి.కామేశ్వరి, శ్రీనివాసులు, రవీంద్ర, డివి రమణయ్య పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో..ఆర్మీ జవాన్లకు శిక్షణ



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్మీ జవాన్లకు వారం రోజులపాటు ఎన్‌సిసి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు 2-ఆంధ్ర ఇఎంఇ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న జవాన్లకు ఈ శిక్షణ ద్వారా ఎన్‌సిసి విద్యార్థులకు ఎలాంటి శిక్షణ ఇవ్వాలి, వారిని భావి భారత పౌరులుగా ఎలా తీర్చిదిద్దాలి అనే విషయాలపై శిక్షణ ఉంటుందన్నారు. మరియు డ్రిల్, ఫైరింగ్, దేశభక్తి తదితర అంశాలపై అవగాహన కలిగిస్తారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించడానికి అన్ని విధాలా సహకారం అందిస్తున్న కళాశాల కరెస్పాండంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌కి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌సిసి అధికారి గోవిందు మాధవయ్య మరియు ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం



ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ కళాశాలలో ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల డైరెక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఇన్‌చార్జ్ ఎం.శ్రీనివాసులు, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, ఫ్యాకల్టీ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ బి. వాసవి సమన్వయం చేశారు. డైరెక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి ఉపాధ్యాయుల పాత్ర మరియు సమాజంలో వారి ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. ఇతర ఫ్యాకల్టీ సభ్యులు ఉపాధ్యాయ దినోత్సవం యొక్క విశిష్టతను వివరించారు. విద్యార్థులు తమ గురువుల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం

## ఎమ్మెల్యే డాక్టర్ పాశిం



విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణం లోని బనిగిసాహెబ్ పేటలో మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన భవనాన్ని, ఆర్వో ప్లాంట్‌ని ఈ నెల 7న ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంచిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, ధనంజయరెడ్డి, సిద్దారెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మీరారెడ్డి, రహీమ్, బహంగీర్, ఆలీబాషా, నరసింహ నాయుడు, శ్రీకంటి రామమోహన్‌రావు, శేగు శ్రీనివాసులు, సనత్‌రెడ్డి, బిల్లు చెంచు రామయ్య, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మినీ గురుకులంలో ఉపాధ్యాయ దినోత్సవం



గూడూరు రెండో పట్టణంలోని ఏపిటిడబ్ల్యూఆర్ మినీ గురుకులంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మయూరి శ్యాంయాదవ్ దాతృత్వంతో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, హెడ్మాస్టర్ మేరి ప్రియత, మయూరిశ్యాం, ఉపాధ్యాయలు లలిత, పద్మావతి, చంద్రలావణ్య, నాగూరమ్మ, అంకమ్మ, వనమ్మ, కల్పన, రమణమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు 'లయన్స్' సన్మానం




ఉపాధ్యాయ దినోత్సవం మరియు లయన్స్ క్లబ్ జోన్ 9 ఛైర్మెన్ ఐ.ప్రసాద్ పర్యటన సందర్భంగా ఇటీవల గూడూరు, సిఆర్‌రెడ్డి రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలోని చంద్రమ్మ భాస్కరరావు ఏసీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులకు, రిటైర్డ్ ఉపాధ్యాయులుకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లయన్ ఎం.రూపేష్ ఆర్థిక సహకారంతో శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలలో విద్యానిధికి 7,500 రూపాయల నగదు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎ.రమణయ్య, కార్యదర్శి రవిచంద్రారెడ్డి, కోశాధికారి పి.వీరేంద్రనాథ్, ఎస్.కె. రియాజ్‌అహ్మద్, ఎం.వి.రమణయ్య, ఎం.మురళీరెడ్డి, చెంచు రామయ్య, సన్మాన గ్రహీతలు ఎన్.వరలక్ష్మి, ఎస్.కోదండరాం, కె.సత్యనారాయణరావు, సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కుట్టుమిషన్ల వితరణ



రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో బుస్సారెడ్డి శకుంతలమ్మ చారిటబుల్ ట్రస్టు దాతృత్వంతో మహిళలకు ఈ నెల 6వ తేదీ గూడూరు డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ట్రస్టు ఛైర్మెన్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆ కుట్టుమిషన్లు అందజేశారు.



# రౌడీషీటర్‌లకు డీఎస్పీ హెచ్చరిక

రౌడీ షీటర్లు మంచి ప్రవర్తనతో మెలగాలని, త్వరలో జరిగే దసరా ఉత్సవాలలో జాగ్రత్తగా ఉండాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి వార్నింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు వందమందిని బైండోవర్ చేసిన సందర్భంగా ఆమె ఈ నెల 7న గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో రౌడీలకు మాస్ హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం ఎంత ప్రశాంతంగా జరుపుకున్నామో అలాగే వెంకటగిరి జాతర, దసరా కలశాలు, జెండాపండుగను కూడా నిర్వహించాలని, ఈ నేపథ్యంలో రౌడీలను బైండోవర్‌చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ శేఖర్‌బాబు, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, టూటౌన్ ఎస్ఐ సుబ్రమణ్యంరాజు, ఏఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అందుబాటులో లేని వ్యవసాయ అధికారులు



మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండడం లేదని, సమస్యలు చెప్పుకునేందుకు వస్తే మధ్యాహ్నం 12గంటలు అయినా కార్యాలయం తెరచుకోలేదని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ప్రభాకర్ తదితరులు వాపోయారు. చిల్లకూరు, ఏ.వో కార్యాలయం వద్ద అధికారులు లేకపోవడంతో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్నారు. నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, మండల కార్యదర్శి రమేష్, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, ఏఐవైఎఫ్ నాయకులు సునీల్, నాయకులు గోపాల్, వెంకటేశ్వర్లు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్యాబోధన చేయండి

## ఉపాధ్యాయులకు సూచించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

### • బుచ్చిలో తొలి సీబీఎస్ఇ స్కూల్‌కి భూమిపూజ



నేటి విద్యార్థులే రేపటి దేశ భవిషత్తు అని, ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్ భూమిపూజ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, బుచ్చిరెడ్డిపాళెంలో మొట్టమొదటి సీబీఎస్ఇ సిలబస్‌తో విద్యా బోధన చేసే వివేకానంద ఇంటర్నేషనల్ స్కూల్‌కి తన చేతుల మీదుగా భూమిపూజ జరపడం సంతోషంగా వుందన్నారు.

## కష్టపడి పనిచేసిన వారిని పార్టీ గుర్తిస్తుంది



కోవూరు నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్‌గా విడవలూరు మండలానికి చెందిన బెజవాడ వంశీకృష్ణారెడ్డిని నియమిస్తూ రాష్ట ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నివాసంలో కోవూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బెజవాడ వంశీరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కోసం ఆయన పడిన కష్టాన్ని పార్టీ గుర్తించిందన్నారు. కోవూరు వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మెన్‌గా రైతులతో మమేకమై వారికి అండగా వుండాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలకు ఏఎంసి ఛైర్మెన్ బెజవాడ వంశీ కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## కార్యకర్త కుటుంబానికి..పార్టీ సాయం 5 లక్షలు



ఇందుకూరుపేట మండలం కొమరిక గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పి.తిరుపతి ఇటీవల ప్రమాదవశాత్తూ మరణించగా, ఆయన కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం 5 లక్షల రూపాయలను సాయంగా పంపింది. ఆ చెక్కును ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇటీవల నెల్లూరులోని తమ నివాసంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

## నారాయణలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు




ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరు హరనాథపురంలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి హాజరై ఉపాధ్యాయులను అధ్యాపకులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంలో, సమాజ నిర్మాణంలో గురువులది గొప్ప పాత్ర అని వారి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన భారత మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున గురుపూజోత్సవం జరగడం ఆనందదాయకమని, ఆ మహనీయుని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడలలో నడవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు కూడా ఆయన్ను సన్మానించారు. నారాయణ కళాశాల ఏజిఎంలు, డీజీఎంలు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

# మాటే సపరేటు.. తప్పదా వేటు!

(మొదటిపేజీ తరువాయి)

రావడం, ఏకంగా 151 సీట్లతో తిరుగులేని మెజారిటీ సాధించడం, అదే క్రమంలో ప్రజల చీత్కారానికి గురై 11కి పడిపోవడం జగన్‌పార్టీకే చెల్లింది. పైగా ఓడిపోయిన తర్వాత ఎమ్మెల్యేలుగా ప్రమాణస్వీకారానికి తప్ప, సభా సమావేశాలకు హాజరుకాబోము అంటూ సరికొత్త సాంప్రదాయానికి సైతం జగన్‌మోహన్‌రెడ్డి నాందిపలికినట్లు కనిపిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. పైగా చట్టంలో ఎక్కడా ప్రస్తావించలేదు కనుక, మొత్తంసభ్యుల సంఖ్యలో 10 శాతం సీట్లు దక్కించుకోకున్నా, ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా తనను గుర్తించాలని కోరుతూ, సభకు గైర్హాజరు కావడమే కాకుండా ఏకంగా కోర్టుకు వెళ్లిమరీ అబాసుపాలవుతున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. నిజానికి పార్లమెంటరీ నిబంధనల ప్రకారం, చట్ట సభల విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని కోర్టులు శాసించలేవన్నది జగమెరిగిన, జగనెరుగని సత్యం. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండే స్పీకర్‌కు సభ నిర్వహణలో కోర్టులు సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వగలవు. ఈ మాత్రం అవగాహన కూడా లేకుండా, ఎంత యాగీ చేసినా రాదని తెలిసి కూడా ప్రతిపక్ష నేత హోదా తనకు ఇవ్వాల్సిందే అంటూ సభకు దూరమై, ప్రత్యక్షంగా ప్రభుత్వాన్ని ఎండగట్టే సువర్ణావకాశాన్ని జగన్ కోల్పోతున్నారనే వాదనలూ లేకపోలేదు.

## ప్రతి అంశంలోనూ రికార్డే!

ఇక రాజకీయాల్లో వైఎస్ జగన్ ప్రస్థానం ఓ వెరైటీ రికార్డుగానే భావించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఎందుకంటే, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సొంత పార్టీ ప్రారంభించినప్పటి నుంచి ప్రతి విషయంలోనూ జగన్ రికార్డుల పరంపర సృష్టిస్తూనే ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

అప్పట్లో కంటిచూపుతో దేశాన్ని శాసిస్తున్నారనే పేరు పొందిన సోనియాగాంధీ ఆజ్ఞను జగన్ ధిక్కరించడం ఓ రికార్డు.

ఏళ్ల తరబడి ఓదార్పుయాత్ర చేయడం ఓ రికార్డు.

కడప ఉప ఎన్నికల్లో 5 లక్షల ఓట్ల పైచిలుకు మెజారిటీతో గెలవడం ఓ రికార్డు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లు సాధించిన సింగిల్ పార్టీగా గుర్తింపు పొందడం ఓ రికార్డు.

అయిదేళ్ల పాలనలో 3 లక్షల కోట్లకు పైగా ప్రభుత్వ సొమ్మును సంక్షేమం పేరుతో పంచిపెట్టడం ఓ రికార్డు.

కేవలం నగదు లావాదేవీలతోనే ప్రభుత్వం అయిదేళ్ల పాటు మద్యం విక్రయాలు చేయడం ఓ రికార్డు. భారీగా మైనింగ్, ఇసుక వ్యాపారాలు ఓ రికార్డు.

ముఖ్యమంత్రి నివాసం కోసం సుమారు రూ.500 కోట్లతో రిషికొండలో ప్యాలెస్ నిర్మించుకోవడం ఓ రికార్డు.

మూడు రాజధానుల పేరుతో ఒక్క రాజధాని కూడా లేకుండా ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించడం ఓ రికార్డు.

25 లక్షల పైచిలుకు పక్కా ఇళ్ల కేటాయింపు ఓ రికార్డు.

అసెంబ్లీలో బూతులు మాట్లాడించడంలో ఓ రికార్డు.

ఎన్నికల సమయంలో ఒకేసారి 90 మంది ఎమ్మెల్యేలకు స్థానచలనం కలిగించడం ఓ రికార్డు.

151 నుంచి 11 సీట్లకే పరిమితం కావడం ఓ రికార్డు.

ఆస్తితగాదాలతో తల్లి, చెల్లిపైనే కేసులు వేయడం ఓ రికార్డు.

కేంద్రంలోని అధికారపార్టీ నేతృత్వంలోని కూటమికి వ్యతిరేకంగా పోటీ చేస్తూనే రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో వారికే మద్దతివ్వడం ఓ రికార్డు.

లోక్‌సభ, రాజ్యసభ బిల్లులకు బేషరతుగా మద్దతు పలకడం ఓ రికార్డు. సుదీర్ఘ పాదయాత్ర ఓ రికార్డు.

11 సీబీఐ చార్జిషీట్‌లు ఓ రికార్డు.

దశాబ్దకాలానికి పైగా బెయిల్‌పై ఉండడం ఓ రికార్డు.

ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ఏడాదిన్నర కాలంగా ప్రతిపక్ష నాయకుడి పదవిస్తేనే అసెంబ్లీకి వెళ్తానంటూ భీష్మించడం ఓ రికార్డు.

ఇలా లెక్కకు మిక్కిలి విషయాల్లో తన పంథా తనదే అన్నట్లుగా జగన్ ముందుకెళ్తుండడం ఆయన వ్యవహార శైలికి అద్దం పడుతోంది. కాగా ఒకవేళ సభకు హాజరుకాలేదనే కారణంతో స్పీకర్ కఠిన నిర్ణయం తీసుకుని, ఎమ్మెల్యే సభ్యత్వం రద్దయితే అది కూడా ఓ రికార్డుగా మిగిలిపోయే అవకాశం ఉంది.

## 7 నుండి 10 రోజుల పాటు సమావేశాలు!

ఇక శాసనసభ సమావేశాల విషయానికి కొస్తే 16వ శాసన సభకు సంబంధించిన నాలుగో సెషన్ సెప్టెంబర్ 18 నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ కూడా అనుమతిచ్చినట్లు అసెంబ్లీ సెక్రెటరీ జనరల్ ప్రకటించారు. అదే రోజు శాసనమండలి సమావేశాలు కూడా ప్రారంభం కానున్నాయి. మొదటిరోజు సమావేశం నిర్వహించిన తర్వాత శాసనసభ, శాసనమండలికి సంబంధించిన బీఏసీ సమావేశాలు నిర్వహించి ఎజెండాను, సభ పనిదినాలను నిర్ధారించనున్నారు. పదిరోజులలోపు సభ నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సమావేశాల్లో ఆరు ఆర్డినెన్సుల స్థానంలో వాటికి సంబంధించిన బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక వరుసగా 60 రోజులు సభకు హాజరుకాకుంటే ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు విషయంపై కూడా ఓ తీర్మానం ప్రవేశపెట్టి సభాపతి తగిన నిర్ణయం తీసుకునేలా వ్యూహం రూపొందిస్తున్నట్లు సమాచారం. తద్వారా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై ఒత్తిడి పెంచాలని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే, అసెంబ్లీకి హాజరుకాకుండా సభ జరిగే సమయంలో ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను మీడియా ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ అధిష్టానం యోచిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అదే జరిగితే కూటమి ప్రభుత్వం ఏ విధమైన ప్రణాళికతో ముందుకు వెళ్తుందో ఆసక్తికరంగా మారింది. కాగా 2014–19 మధ్య కాలంలో స్పీకర్‌గా వ్యవహరించిన కోడెల శివప్రసాద్ తగిన సమయం ఇవ్వడం లేదంటూ అసెంబ్లీని బాయ్‌కాట్ చేసి, తర్వాత పాదయాత్ర చేసి ముఖ్యమంత్రిగా సభలో జగన్ అడుగుపెట్టారు. ఇదే క్రమంలో 2019–24 మధ్య కాలంలో అసెంబ్లీలో తమ కుటుంబాన్ని అవమానించి శాసనసభను కౌరవ సభగా మార్చారంటూ అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు అసెంబ్లీని బాయ్‌కాట్ చేశారు. తర్వాత గౌరవసభ అంటూ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి సీఎం హోదాలో అసెంబ్లీలో అడుగు పెట్టారు. అయితే, ఈసారి మాత్రం ప్రతిపక్ష నేత పదవి ఇవ్వ లేదంటూ సభకే జగన్ రాకపోవడం, ఇదే అదునుగా కూటమి ప్రభుత్వం జగన్ సహా వైఎస్సార్‌సీపీకి చెందిన 11మంది ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దుకు వ్యూహాలు రచిస్తుండడం ఉత్కంఠగా మారింది..!

# 'అపోలో'లో 3500లకే.. గుండె జబ్బుల పరీక్షలు

నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో కేవలం 3500/– రూపాయలకే గుండె జబ్బుల స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ తెలియజేశారు. నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో ఇటీవల సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి, కార్డియాలజిస్టులు డాక్టర్ షర్మిలి నౌషీన్, డాక్టర్ నాగభూషణ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలో గుండె జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, తక్కువ ఫీజులతోనే అపోలో సంస్థ వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఈనెల 29న ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని నేటి నుండి తక్కువ ఫీజులకే గుండె సంబంధిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11వేల రూపాయల విలువైన 20 రకాల గుండె సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలను కేవలం 3500/– రూపాయలకే చేస్తున్నా




మన్నారు. అక్టోబర్ 31వ తేదీ వరకూ ఈ స్క్రీనింగ్ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని, 40 ఏళ్లు దాటిన వ్యక్తులు, గుండె సంబంధిత వ్యాధులు ఉన్న కుటుంబాల్లోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు, కార్డియాలజీ విభాగం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 'కీర్తి పురస్కారం' అందుకున్న డా.గంగిశెట్టి

నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత, బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగిన కార్యక్రమంలో 'కీర్తి పురస్కారం' అందుకున్నారు. తెలుగు భాషకు ఉత్తమ సేవలందిస్తున్న 24 మందికి తెలుగు విశ్వవిద్యాలయం వారు 2023 సంవత్సరానికి కీర్తి పురస్కారాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాలసాహిత్యంలో విశేష సేవలందిస్తున్న డా.గంగిశెట్టికి కీర్తిపురస్కారం లభించింది. ఈ పురస్కారం కింద ఆయనకు 5,116 రూపాయలతో పాటు, అభినందన పత్రాన్ని అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాకమిషనర్ శ్రీదేవసేన, తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడిపూడి హరికృష్ణ, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, రామ్మూర్తి తదితరులు పాల్గొని డా. గంగిశెట్టి బాలసాహిత్యానికి చేస్తున్న సేవలను ప్రశంసించారు.

# ఆకట్టుకుంటున్న 'రామాయణ ప్రవచనాలు'




వెంకటాచలంలోని మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల, నెల్లూరులోని పద్య సారస్వత పరిషత్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10నుంచి వెంకటాచలం మండలంలోని ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం ఆవరణలో శ్రీమద్రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో ఏడురోజుల పాటు జరిగే ఈ ప్రవచనాల్లో ప్రసిద్ధ పండితులు పాల్గొని శ్రీమద్రామాయణం విశిష్టతను అందరికీ అర్థమయ్యే విధంగా సరళమైన భాషతో తెలియజేస్తున్నారు. దీంతో, ఈ ప్రవచనాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. తొలిరోజు బుధవారం నాడు విశ్రాంత సంస్కృ తోపన్యాసకులు.. అవధాని కోట రాజశేఖర్ బాలకాండలోని విశేషాలను విశదీకరించారు. అనంతరం, సింహపురి వైద్యసేవా సమితి వైస్‌ఛైర్మన్ బాలు సుబ్బారావు, డా. మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొని అవధాని రాజశేఖర్‌ను ఘనంగా సన్మా నించారు. అదేవిధంగా ఈనెల 11న విశ్రాంత అధ్యాపకురాలు డా. కె.గిరిజా లక్ష్మి అయోధ్యకాండ, 12న శతావధాని కొండెపి మురళీకృష్ణ అరణ్యకాండ, 13న విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు కిష్కింధా కాండ, 14న డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు సుందరకాండ, 15న డా.ఐనవోలు శ్రీనివాస చక్రపాణి యుద్ధకాండ, 16న డా.సింగరాజు రామకృష్ణ ప్రసాదరావు ఉత్తరకాండలను వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# కపోతాలు ఎగరాలి



ఇక్కడ చెట్లకు కత్తులు కాస్తున్నాయి.
రోడ్లలో తుపాకులు మతాబులై ఉద్భవిస్తున్నాయి.
గాలి దైన్యాన్ని పులుముకొని ఎరుపెక్కింది
సౌకుమార్యం నుదుట కత్తి
గాయం గాటు కన్పిస్తున్నది
ఏమైంది ఈ నగరానికి!
ఒక్కసారి ఉప్పెనలా
కమ్ముకున్న జులం దెబ్బకు
సరిహద్దు సాంద్రత చెరిగిపోతున్నది
మొలగొలుకుల పట్టణ శోభలో
ఏదో అపశృతి
నెరజాణలు బుల్లితెర విలన్లలై
ప్రతిఫలించే చోట
ఓ అక్రమం.. ఒక అన్యాయం
పెల్లుబికే ధమనుల్లో రక్తాక్షర
చరిత్ర వేగంగా ముసురుకొంటున్నది.
పావన పినాకినీ నది
హొయల్లో అరుణారుణ క్రాంతిరేఖ
వెలుగురేకై విరబూయాలి
తిక్కన భారతం ప్రభవించిన
నేలన ఓ అరుణిమ ముందుకొచ్చి
జనాన్ని ప్రశ్నించాలి
జాగృతలను చేయాలి
మర్దలను పెనుబాకులతో మర్దరు చేయాలి
నా శాంతి సీమలో మళ్ళీ కపోతాలు ఎగురాలి!
కలుషితమైన రాజకీయావరణంలో
మందారతపు సౌగంధాన్ని లేపనంగా అద్దాలి
రేపు నా సీమ మళ్ళీ శోభాయమానమవుతుంది
మొనగాళ్ళకు నెలవై వినుతికెక్కుతుంది!
తమ్ముడూ,
తమలపాకులతో యుద్ధాలు చేయాలిగాని
కుత్తుకలు కత్తరించే
కుతంత్రాలు మానవాళికి
వాంఛనీయం కాదు కదా!



చిన్ని నారాయణరావు
9440202942

# శ్రీసిటీ నర్సరీలో..చిన్మయా విద్యార్థుల విజ్ఞాన యాత్ర



చిన్మయ విద్యాలయ విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా ఈనెల 10న శ్రీసిటీ నర్సరీని సందర్శించారు. 2వ తరగతికి చెందిన 108 మంది విద్యార్థులు ఈ యాత్రలో భాగంగా ఇక్కడికి వచ్చారు. శ్రీసిటీ ఉద్యానవన అధికారి పవన్‌కుమార్ వారికి నర్సరీలోని వివిధ మొక్కలు, వాటి విశిష్టత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు నర్సరీ ఆవరణలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆసీనులై భక్తిశ్రద్ధలతో భగవద్గీతలోని 15వ అధ్యాయం 'పురుషోత్తమ ప్రాప్తియోగం' పారాయణం చేశారు. శ్రీసిటీ నిర్వాహకులు వారికి స్వామివారి తీర్థ, అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ విజ్ఞాన యాత్రకు విచ్చేసిన తమ విద్యార్థులకు నర్సరీ ఆవరణలో పచ్చదనం నిండిన చల్లని ఆహ్లాదకర, ఆధ్యాత్మిక వాతావరణం ఎంతో హాయిని, సరికొత్త అనుభూతిని ఇచ్చిందని స్కూల్ ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. తమ సందర్శనకు వీలుగా అన్ని వసతులు సమకూర్చి తమకు అవకాశం కల్పించిన శ్రీసిటీ యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వెంకయ్యస్వామిని దర్శించుకున్న సాయిభక్తులు



నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని గొలగమూడి గ్రామంలో కొలువైవున్న అవధూత..భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయాన్ని సందర్శించుకునేందుకు నెల్లూరు నగరంలోని అనేకమంది సాయిబాబా భక్తులు పాదయాత్రగా వెళ్ళారు. 'ఓం నారాయణ ఆదినారాయణ' అంటూ నామోచ్చరణలు చేస్తూ శ్రీ వెంకయ్యస్వామి సన్నిధికి చేరుకున్నారు. ఈనెల 7న నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న శ్రీ సాయిబాబా అద్దాలమందిరం వద్ద నుంచి భక్తులు ఈ యాత్ర చేపట్టారు. మందిరం వ్యవస్థాపకులు మధుసాయి నేతృత్వంలో తొలుత శ్రీ సాయిబాబాకి ప్రత్యేకపూజలు జరిగాయి. అనంతరం సుమారు 350 మంది భక్తులు కోలాటాలు, భజనలు చేస్తూ గొలగమూడికి వెళ్ళి స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయిదర్బార్ మందిరం తరఫున శ్రీ వెంకయ్యస్వామి వారికి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి పూజలు చేసుకున్నారు. పాబోలు సుబ్బరామయ్య, బాబీసాయి భక్తబృందం ఈ యాత్రలో పాల్గొన్నారు.

## టూకీగా...



### వరిగొండలో యూరియాపై అవగాహన

తోటపల్లిగూడూరు మండలం వరిగొండ గ్రామంలో ఈనెల 8న వ్యవసాయాధికారిణి శిరీషా ఆధ్వర్యంలో రైతులకు యూరియా వాడకంపై అవగాహన కలిగించారు. యూరియా అతిగా వాడడం పంటలకు మంచిది కాదని తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఏ మోతాదులో వాడాలో రైతులు అవగాహన కలిగించుకోవాలని సూచించారు.

### సోమశిల నీటిమట్టం.. 70 టీఎంసీలు దాటింది

సోమశిల జలాశయం నీటిమట్టం ఈనెల 9వ తేదీ నాటికి 70 టీఎంసీలు దాటింది. దీంతో నీటి పారుదలశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఎగువప్రాంతాల నుంచి వస్తున్న వరదనీటితో కలిసి మొత్తం 70.230 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో దిగువప్రాంతానికి నీరు విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### సంజీవరాజుపల్లి పాఠశాల తనిఖీ

ఉదయగిరి మండల పరిధిలోని సంజీవరాజుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఈనెల 9న ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. పాఠశాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### సిద్ధిపురం వద్ద రేషన్ బియ్యం పట్టివేత

సంగం మండలం సిద్ధిపురం వద్ద రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తీసుకువెళ్తున్న ఓ వాహనాన్ని విజిలెన్స్ అధికారులు ఇటీవల పట్టుకున్నారు. వాహనంలోని 60 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కి తరలించి, కేసు నమోదు చేశారు.

### పెనుబర్తిలో పశువైద్యునికి వీడ్కోలు

రాపూరు మండలం పెనుబర్తిలోని పశువైద్యుడు బి.ప్రసాద్ పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలంలో అసిస్టెంట్ జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందడంతో, స్థానిక పశువైద్య సిబ్బంది ఈనెల 8న ఆయన్ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పశువైద్యశాఖ ఉద్యోగులు పెంచల్‌రెడ్డి, అఖిల్, జాన్, రవి, రమణయ్య, లక్ష్మీభవాని, సుప్రజ పాల్గొన్నారు.

### విడవలూరులో అక్షరాస్యత దినోత్సవం

విడవలూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. కోవూరు నియోజకవర్గంలోని నిరక్షరాస్యులందరినీ వచ్చే ఏడాది మార్చి నాటికి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి మల్లు మస్తాన్‌రెడ్డి చెప్పారు. తొలుత విద్యార్థులతో కలిసి అక్షరాస్యతపై నిర్వహించిన ర్యాలీ గ్రామస్తులను బాగా ఆకట్టుకుంది.

### వీరంపల్లిలో ఉపాధ్యాయులకు సన్మానాలు

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మనుబోలు మండలం వీరంపల్లి ఉన్నత పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులైన ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీకాంతరావు, ప్రభావతిలను జూనియర్ ఉపాధ్యాయులు ఈనెల 8న శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఉపాధ్యాయులు సోమా పద్మారత్నం, జీబీ దాస్, శ్రీధర్, శైలజ, సరస్వతి, మృదుల పాల్గొన్నారు.

### నార్త్‌రాజుపాలెంలో సీఐటీయు మహాసభలు

కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెంలో ఇటీవల మండల సీఐటీయు 7వ మహాసభలు జరిగాయి. సీఐటీయు నాయకురాలు రెహానాబేగం, సీపీఎం నాయకులు గోనె దయాకర్, గౌస్‌బాషా, అంగన్‌వాడీ సంఘం నాయకురాలు విజయమ్మ, దేవానంద్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు. పేద ప్రజల సమస్యలను తీర్చేందుకు ప్రత్యేకించి కార్మికుల సమస్యల సాధనకు సీఐటీయు నిరంతరం పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.



## 15వ ఉపరాష్ట్రపతిగా

# సి.పి.రాధాకృష్ణన్

### తమిళనాట నుండి 3వ వ్యక్తిగా రికార్డు..!

**ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న జనసంఘ్ నేతకు అపూర్వ గుర్తింపు దక్కింది. భారతీయ జనతాపార్టీలో తమిళనాడు మోడీగా, అజాతశత్రువుగా గుర్తింపు పొందిన సీపీ రాధాకృష్ణన్ ఎన్డీయే తరపున పోటీ చేసి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. తన ప్రత్యర్థి ఇండియా కూటమి అభ్యర్థైన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పై 152 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.**

తెలుగుదేశం, జనసేన లాంటి ఎన్డీయే పక్షాల ఎంపీలతో పాటు వైఎస్సార్‌సీపీ వంటి తటస్థ పార్టీల మద్దతుతో ఆయన గెలుపు బావుటా ఎగురవేశారు. ఎలక్టోరల్ కాలేజీలోని మొత్తం 781 ఓట్లలో 767 మంది ఎంపీలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో 15 ఓట్లు చెల్లుబాటు కాకపోవడంతో 752 ఓట్లను లెక్కించారు. వీటిలో రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు వచ్చాయి. దీంతో రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

### క్షేత్రస్థాయి నుంచి హస్తిన వైపుగా..

కొత్త ఉపరాష్ట్రపతిగా ఎన్నికైనా సీపీ రాధాకృష్ణన్ తన జీవితకాలంలో ఎన్నో పదవులు చేపట్టి వాటికి వన్నెతెచ్చారు. 16వఏటే బీజేపీ మాతృసంస్థ జనసంఘ్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. ఈ క్రమంలో కోయంబత్తూరు ఎంపీగా రెండు సార్లు ఎన్నికయ్యారు. తమిళనాడు బీజేపీ రాష్ట్రవిభాగం అధ్యక్షుడిగా పనిచేశారు. జాతీయ పార్టీల ఉనికి అంతంతమాత్రమైన తమిళనాడులో ద్రవిడ సిద్ధాంతాలను పక్కనపెట్టి హిందూత్వ అంశంపై దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేశారు. నదుల అనుసంధానం, ఉగ్రవాద నిర్మూలనే ప్రధానాంశాలుగా ఏకంగా 19 వేల కిలో మీటర్లు ఆయన రథయాత్ర చేసి దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందారు. తర్వాత కాలంలో ఏ పదవీ చేపట్టకున్నా బీజేపీని వీడలేదు. ఆ నిబద్ధతే ఆయన్ని నేడు ఉపరాష్ట్రపతి స్థాయికి చేర్చిందని విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. ఇక 2023 చివర్లో జార్ఖండ్ గవర్నర్‌గా తర్వాత కాలంలో తెలంగాణ, పుదుచ్చేరి ఇన్‌ఛార్జి గవర్నర్‌గా ఆయన పనిచేశారు. ఇక 2024 నుంచి మహారాష్ట్ర గవర్నర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో దక్షిణాదిపై ముఖ్యంగా తమిళనాడుపై ఫోకస్‌పెట్టిన బీజేపీ అగ్రనాయకత్వం అక్కడ వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల టార్గెట్‌గా సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి బరిలో దింపిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. రాధాకృష్ణన్ ఎన్నికతో తమిళ ఓటర్ల కరుణ తమపై కలుగుతుందనే ఆశాభావంతో అక్కడి బీజేపీ నాయకులు శాసనసభ ఎన్నికలకు సమాయత్తం అవుతున్నారు.

### నిబంధనలు పాటిస్తారా..?

ఈ ఏడాది జూలై వరకు ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన జగదీప్ ధన్కడ్ అనుహ్యంగా రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. అయితే అందరూ ముందుగా అనుకున్నట్లే ఎన్డీయే అభ్యర్థి అయిన రాధాకృష్ణన్ ఘన విజయం సాధించారు. ఇక కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పక్షాల అభ్యర్థి అయిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఓటమి తప్పదని తెలిసినా బరిలో నిలిచారు. దీనికి ప్రధాన కారణం చెట్టుకొకరు పుట్టకొకరుగా ఉన్న ఇండియా కూటమిలోని రాజకీయ పక్షాలను ఏకతాటిపైకి తీసుకురావడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇండియా కూటమిలో మొత్తం 315 వరకు ఎంపీలున్న నేపథ్యంలో 300 ఓట్లు సుదర్శన్‌రెడ్డికి పోలవడం ఆసక్తికర పరిణామంగానే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ వ్యవహారాల్లో ఇండియా కూటమి చురుగ్గా ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం కనిపిస్తోంది. భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ సెప్టెంబర్ 12న ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## నెల్లూరు రూరల్‌లో 30 కోట్లతో..

# విద్యుత్ సౌకర్యాలు

### ఎమ్మెల్యే కోటంరెడ్డి వెల్లడి



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఇటీవలికాలంలో వందలాది కోట్ల రూపాయల రోడ్లు, డ్రెయిన్లు తదితర అభివృద్ధి పనులెన్నో జరిగిన నేపథ్యంలో, ప్రజలకు మేలైన విద్యుత్ సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విశేష కృషిచేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో, దాదాపు 30 కోట్ల రూపాయల వ్యయంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజలకు 24 గంటలూ విద్యుత్ సరఫరా ఉండే విధంగా, 3-ఫేస్ కరెంటు సదుపాయం కలుగజేస్తున్నామని ఆయన చెప్పారు. ఇటీవల ఆ పనుల పురోగతిని ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18 గ్రామాలు, 1, 2, 12 డివిజన్లు, అంబాపురం-అక్కచెరువుపాడు తదితర ప్రాంతాల్లో ప్రజలకు విద్యుత్ సౌలభ్యం కోసం ఆమేరకు పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే అవి ప్రారంభమవుతాయని కూడా ఆయన హామీ ఇచ్చారు.

## ఇరుకళల పరమేశ్వరి ఆలయానికి..కొత్త కమిటీ



నెల్లూరు గ్రామశక్తి.. నగరంలోని స్వర్ణాల చెరువు ఒడ్డున వెలసివున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయానికి కొత్త కమిటీని నియమిస్తూ దేవాదాయ శాఖ ఈనెల 6న ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ కమిటీ ఛైర్మెన్‌గా ఒట్టూరు సురేంద్రయాదవ్ నియమితులయ్యారు. సభ్యులుగా అల్లం లక్ష్మి, తమ్మినేని వెంకటరత్నంనాయుడు, కొండా వెంకటేశ్వరరెడ్డి, చెంచయ్య, హరికుమార్, మన్నేపల్లి వెంకటలక్ష్మి, మోమిడి కుమార్, మిడతల మహాలక్ష్మిలు నియమితులయ్యారు. ఎక్స్ అఫిషియో సభ్యునిగా పులికొలను చంద్రశేఖర్‌ను నియమించారు.

# ఆంధ్రా పోలీసులు..'అబ్బో' అనిపించారు!



- 'ఆపరేషన్ ట్రేస్'తో అద్భుత ఫలితాలు సాధించారు!
- 670 మంది తప్పిపోయిన బాలికల ఆచూకీ కనిపెట్టారు
- వారందరినీ తిరిగి తల్లితండ్రుల వద్దకు చేర్చారు

***మనవాళ్ళు అనుకోవాలే గానీ, ఏమైనా సాధించగలరనేందుకు 'ఆపరేషన్ ట్రేస్' ఒక తాజా ఉదాహరణ. సహజంగానే పోలీసులంటే లాఠీలు ఝుళిపిస్తూ కఠినంగా ఉంటారనుకుంటాం కానీ, అవసరమైతే వారెంత కారుణ్యంతో ఉంటారో కూడా ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమం నిరూపిస్తోంది. ప్రత్యేకించి ఆంధ్రా పోలీసుల చిత్తశుద్ధికి, మానవతా హృదయానికి ఇదో మచ్చుతునక అనే చెప్పవచ్చు. మనసుండాలే గానీ, మార్గం ఉండదా... అన్నట్లు పోలీసుల శ్రమ ఫలించింది. కేవలం 30 రోజుల్లోనే 670 మంది తప్పిపోయిన బాలికల ఆచూకీని కనిపెట్టి, వారిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. లేకుంటే ఆ బాలికల భవిష్యత్తు ఏమయ్యేదో?!.. రాష్ట్ర పోలీసు చరిత్రలోనే ఇదొక గప్ప మానవీయ కార్యక్రమం అనుకోవచ్చు!..***

ఇంట్లో ఉన్న కుమార్తె ఉన్నట్లుండి కనిపించకపోతే ఆ తల్లితండ్రుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. తప్పిపోయిన ఆ బాలిక కనిపించేదాకా వారు పడే బాధ అంతింత కాదు. కానీ, దురదృష్టవశాత్తూ మన రాష్ట్రంలో అలా తప్పిపోతున్న బాలికల సంఖ్య గణనీయంగానే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆంధ్రప్రదేశ్ పోలీసుశాఖ ఇటీవల వాటిపై ప్రత్యేకదృష్టి సారించింది. రాష్ట్రంలో తప్పిపోయిన, లేదా కిడ్నాప్‌లకి గురైన, లేదా మరే కారణం వల్లనైనా కనిపించకుండా పోయిన బాలికల వివరాలన్నిటినీ కూలంకుషంగా సాంకేతిక బృందాలతో నిఘానేత్రాలతో పరిశీలించింది. వారిప్పుడు ఎక్కడున్నారో తెలుసుకుని, వారిని రక్షించి తిరిగి వారి తల్లితండ్రుల వద్దకు చేర్చాలనే బృహత్తరమైన కృషే చేసింది.

### బాలికల ఆచూకీ కోసం ప్రత్యేక డ్రైవ్..

రాష్ట్రంలో జులై 31 నాటికి 1065 మంది బాలికలు అదృశ్యమైన కేసులుండగా, వారిని ఎలాగైనా వెదికి పట్టుకునేందుకు రాష్ట్ర పోలీస్‌శాఖ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక ప్రత్యేక డ్రైవ్‌ని ప్రారంభించింది. అది కూడా, ఆగస్టు 1 నుంచి 31వ తేదీలోగా కేవలం 30 రోజుల్లోనే ఆ కేసులను ఒక కొలిక్కి తీసుకువచ్చేందుకు భారీ ప్రణాళిక చేపట్టింది. అనుకున్నదే తడవుగా, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా నేతృత్వంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని పోలీసులు అప్రమత్తమై రంగంలోకి దిగడం, పోలీసు బృందాలు హుటాహుటిన బయలుదేరి బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రెడ్‌లైట్ ఏరియాలు తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టడం ప్రారంభించడంతో, తప్పిపోయిన బాలికలను కనుగొనేందుకు పెద్దఎత్తున కార్యాచరణ మొదలైంది. ఈ ప్రయత్నంలో ఆశించినస్థాయిలో సత్ఫలితాలను కూడా సాధించడం విశేషం. ఈ డ్రైవ్‌లో భాగంగా, జిల్లాస్థాయి, సబ్‌డివిజన్ల స్థాయిల్లో కూడా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు బాలికలు లేదా అమ్మాయిలు ఎప్పుడెప్పుడు ఎక్కడెక్కడ కనిపించకుండా పోయారో ఆరాతీశాయి. సీసీ టీవీల ఫుటేజీలు, కాల్ డేటాలు, వారి కుటుంబసభ్యులు, స్నేహితుల నుంచి అన్ని వివరాలను పోలీసులు పూర్తిస్థాయిలో సేకరించి, స్వచ్ఛంధసంస్థల సహకారం కూడా తీసుకుని ఎట్టకేలకు 670 కేసులను ఛేధించారంటే చిన్న విషయమేమీ కాదు. అంతమంది బాలికలను తిరిగి అమ్మానాన్నల వద్దకు చేర్చడం గొప్ప విషయం. లేకుంటే ఆ బాలికలు ఏ అసాంఘిక శక్తుల బారిన పడేవారో, లేదా ఎలాంటి దుస్థితులకు, దుర్ఘటనలకు బలయ్యేవారో చెప్పలేం.

### నెలరోజుల్లోనే 670 మందిని కనుగొన్నారు...

అదృశ్యమైన బాలికల కాల్‌డేటాలను సాంకేతిక పరిజ్ఞానంతో విశ్లేషించడం ద్వారా అధికశాతం మంది..అంటే 423 మంది బాలికల ఆచూకీని పోలీసులు కనిపెట్టారు. బాలికల కుటుంబసభ్యులు లేదా వారి స్నేహితులిచ్చిన వివరాలను బట్టి మరో 130మంది ఎక్కడున్నదీ తెలుసుకోగలిగారు. శక్తి బృందాల నిఘాలో ఇంకో 73 మంది ఆచూకీ దొరికింది. ఇలా.. ఆచూకీ లభించినవారిలో 14 నుంచి 18 ఏళ్లలోపు వారే ఎక్కువగా ఉండడం గమనార్హం. మొత్తమ్మీద ఎలాగైతేనేం ఒకే ఒక్క నెలలో ఏకంగా 670 మంది బాలికలను, వారిలో కొంతమంది యుక్తవయసు వచ్చినవారిని రక్షించగలగడం పోలీసుశాఖ గొప్ప పనితీరుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. కేవలం వారిని తల్లితండ్రులకు అప్పగించడమేకాక, వారి భవిష్యత్తుకు అవసరమైన సూచనలు కూడా ఇవ్వడం, బాధితులకు తమవంతు సేవలు లేదా సాయం అందించడం పోలీసుశాఖ ఔదార్యాన్ని చాటేవే. ఒక్క నెలలోనే 63శాతం మిస్సింగ్ కేసులను ఛేధించగలగడమే కాక, మిగిలిన కేసులపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. ఇకనుంచి ఎప్పటికప్పుడు ఈకేసుల విషయంలో అప్రమత్తంగా ఉండేలా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోలీసుల మానవీయ సేవలకు ఇంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి?!...

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com